ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మార్చి 2009

వెల : రూ. 10

సుబోధ

బ్రహ్మసాక్షాత్కారానికి భగవన్నామమే చాలని ఒక ధర్మబోధకుడు పలుకగా శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "నిజమే, భగవంతుడి దివ్యనామం అఖండశక్తిమంతం, సందేహంలేదు; కానీ భగవంతుడి కోసం పరితపించాలి. కామినీ కాంచనాల మీద మనసు నిలుపుకొని భగవన్నామస్మరణ చేస్తే లాభం ఏమిటి? కేవలం మంత్రంతో తేలుకాటు నొప్పిపోదు, ఆవుపేడ పొగకూడా అక్కడ వెయ్యాలి. ఒక్కసారి భగవన్నామాన్ని ఉచ్చరిస్తే చాలు మానవుడి సమస్త పాపాలూ హరించిపోతాయి, సంశయంలేదు. కానీ వెంటనే మానవుడు మరలా పాప కృత్యాలను ఎందుకు చేస్తున్నాడు? నేను ఎట్టి పరిస్థితుల్లోనూ పాపకార్యాల్ని చేయను అనే దృఢ సంకల్పం లేకపోవడం వల్ల మానవుడు పదే పదే పాపాలు చేస్తున్నాడు.



గంగాస్నానం సమస్త పాపహారం. మానవుడు గంగలో స్నానం చేస్తున్నప్పుడు అతడు చేసిన పాపాలన్నీ నది ఒడ్డునున్న చెట్టు మీద కూర్చుంటాయి. అతడు స్నానంచేసి బయటకు రాగానే చెట్టుమీద ఉన్న ఆ పాపాలు తిరిగి అతడి భుజాల మీదకి వాలతాయి. కాబట్టి నిజమైన భక్తిభావం కలుగచెయ్యమనీ, పేరు ప్రతిష్ఠలు, శరీరసుఖాలు మొదలైన తుచ్ఛక్షణిక విషయాల్లోని మోహం క్షీణింపచెయ్యమనీ, భగవంతుణ్ణి వేడుకొంటూ సదా అతడి నామస్మరణ చెయ్యాలి.

నలుసంత నిప్పు పడగానే కొండంత దూది తగులబడి బూడిదైపోయే విధంగా పవిత్ర భగవన్నామాన్ని భక్తితో కీర్తించినంతనే పాపరాసులన్నీ దగ్ధమైపోతాయి. ❖

('శ్రీరామకృష్ణ బోధామృతం' నుంచి)

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 500 029
ఫోన్: 040–2766 7799, 2763 3936
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద**
సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

సురభి

మధ్యాహ్నం సుమారు ఒంటిగంటకు మాతృదేవి కాశీలోని అద్వైతాశ్రమానికి విచ్చేశారు. కాసేపు అక్కడ గడిపిన తరువాత కిరణ్‌బాబు కొత్త ఇంటి(లక్ష్మీనివాస్)కి వెళ్ళారు. ఆ ఇల్లు ఆశ్రమానికి చాలా దగ్గరలో ఉంది. విశాలమైన వసారా చూడగానే మాతృదేవి "భాగ్యవంతుడు కాకుంటే ఇలాంటి ఇల్లు లభించదు. చిన్న చోట నివసిస్తే మనసు సంకుచితమైపోతుంది. విశాలమైన చోట నివసిస్తే మనసు కూడా విశాలమవుతుంది''అని వ్యాఖ్యానించారు.

మర్నాడు ఉదయం మాతృదేవి పల్లకీలో వెళ్ళి విశ్వనాథుణ్ణి, అన్నపూర్ణను దర్శించారు. రెండు రోజుల తరువాత మళ్ళీ అద్వైతాశ్రమానికి వెళ్ళారు. సేవాశ్రమానికి కూడా వెళ్ళారు. రాజా మహరాజ్ (స్వామి బ్రహ్మానంద), హరి మహరాజ్ (స్వామి తురీయానంద), చారుబాబు, డాక్టర్ కంజీలాల్ తదితరులు అప్పుడక్కడ ఉన్నారు. కేదార్‌బాబు (స్వామి అచలానంద) పల్లకీతో పాటు వెళ్ళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మాతృదేవికి చూపించారు. అంతా చూసిన తరువాత మాతృదేవి దక్షిణం వైపు వసారాలోకి వెళ్ళి కూర్చున్నారు. కేదార్‌బాబుతో ఆశ్రమ నిర్వహణను ప్రశంసిస్తూ ఇలా అన్నారు:

"ఇక్కడ శ్రీరామకృష్ణులు నెలకొని ఉన్నారు. సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి అనుగ్రహం సంపూర్ణంగా ఉంది."

మాతృదేవి తమ బసకు తిరిగి వెళ్ళిపోయిన కొంతసేపటికి ఒక భక్తుడు సేవాశ్రమానికి వచ్చి, ఒక పది రూపాయల నోటు ఇచ్చి "ఈ పది రూపాయలను మాతృదేవి సేవాశ్రమానికి విరాళంగా ఇచ్చారు"అని చెప్పాడు.

ఆ పది రూపాయల నోటును ఇప్పటికీ కాశీ రామకృష్ణ సేవాశ్రమంలో పదిలపరచి ఉంచారు. ❖

(స్వామి అరూపానంద స్మృతుల నుంచి)

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 66 సంచిక: 3 మార్చి 2009

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః ।
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్ దుఃఖభాగ్ భవేత్ ॥

అందరూ సంతోషంగా ఉండాలి. అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలి.
మంచియేదో, సన్మార్గమేదో అందరూ తెలుసుకోవాలి.
ఎవరూ బాధలకు గురికాకుండా ఉండాలి.

లోపలి పేజీల్లో...

4 సంపాదకీయం
ఆదర్శ జీవనం అనుసరణీయం!

8 శోభాయమానం-సకల శుభకరం 'ఉగాది'

13 ధీరవాణి
దుఃఖాలకు అసలు కారణం...

16 బొమ్మల కథ
మూగజీవులకూ ముక్తిని ప్రసాదించిన మహర్షి

20 కనుల పండువగా కర్నూలు భక్త సమ్మేళనం

24 యువవాణి
నవతరం సందేహాలకు సమాధానాలు

25 నా జీవితంలో స్వామి వివేకానంద
మనస్సును తాకిన 'సాహిత్య సర్వస్వం'

28 మనసు - మర్మం
ఊహలకు కళ్ళెం వేద్దాం!

33 ప్రాచీన గాథలు : జీవన వికాసం
వామనావతారం - ఆత్మశక్తి సందేశం



37 అమర భారత ప్రతిభ
యంత్ర శాస్త్రం

శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'లో సభ్యులుగా చేరి ధనదానం చేయాల్సిందిగా మనవి. సభ్యుల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు చిరునామా	రూ.
రాజ పోషకులు	: శ్రీ జి.ఎస్. రామచంద్రమూర్తి, విద్యుత్ కాలనీ, రాజమండ్రి - 533 106	5,000
పోషకులు	: శ్రీ ఎ. జనార్ధనాచార్యులు, అంగర, తూర్పు గోదావరి జిల్లా - 533 307	1,100
" "	: శ్రీ బిజ్జల నారాయణ, తొర్రూరు, వరంగల్ జిల్లా - 506 163	1,000
" "	: శ్రీ గోపాలకృష్ణ, శివాజీనగర్, హెచ్.బి. కాలనీ, అనంతపురం -515 001	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణుల, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి./ చెక్కు రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను.

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం.

భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో
స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

ముఖచిత్రం : విశ్వంలోని శోభ అంతా వసంత ఋతువు ఆగమనంతోనే ప్రారంభమవుతుంది. చిగురించిన చెట్లు, లతలతో వికసించిన పూలు, చల్లని గాలులతో ఉగాది నాటి సూర్యోదయ శోభతో 'వసంత లక్ష్మి' గోచరిస్తుంది. అందరికీ ఆహ్లాదాన్నిచ్చే ఆ వసంత లక్ష్మిని 'శ్రీ రామకృష్ణ ప్రభ' ముఖచిత్రంగా పాఠకులకు అందిస్తున్నాం. చిత్రకారుడు : దాకోజు శివప్రసాద్, హైదరాబాద్

ADVERTISEMENT TARIFF

	MULTI COLOUR	B & W
Fourth Cover	Rs.25,000	-
Second Cover	Rs.20,000	-
Third Cover	Rs.20,000	-
Inside Full Page	Rs.15,000	10,000
Inside Half Page	Rs.10,000	5,000

చందా వివరాలు		ఇండియాలో	విదేశాలలో
విడి ప్రతి	:	రూ. 10	-
ఒక సంవత్సర చందా	:	రూ. 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	రూ. 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	రూ. 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	రూ. 1500	$ 365

గమనిక : డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి. పంపవలసిన చిరునామా : Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

6 నేర్చుకోవడం అంటే...

7 దుర్గాదేవి దివ్యదర్శనాలు

9 శ్రీకృష్ణుడే శ్రీచైతన్యుడు!

10 దేవీ వైభవం

14 పరమేశ్వరుని పరిరక్షణలో...

18 గురువునే పరీక్షించిన శిష్యుడు

19 జగత్తుకు కారణం బ్రహ్మమా?

22 అలౌకిక ఆనందానికి వైరాగ్యం

23 అందరి పయనం ఆ ఉన్నత శిఖరాలకే...

26 మీ పురోగతిని ఆపుతున్నదెవరు?

27 మహనీయుల జీవితాల్లో మధుర ఘట్టాలు
కరుణామూర్తికి కనువిప్పు!

29 ఆత్మవిశ్వాసం

30 పరిపూర్ణతనిచ్చే 'విద్య'

34 అసలైన ఆధ్యాత్మికత

35 ఆచారవ్యవహారాలు - అంతరార్థాలు
పూజకు పనికిరాని పూలు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు పైన చిరునామాకి కుడి భాగంలో మీ చందా గడువు నెల పొందుపరచబడి ఉంది. సకాలంలో సొమ్ము చెల్లించి, చందా పొడిగించుకొని, 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆధ్యాత్మిక వెలుగులు మీ ఇంట నిరంతరాయంగా ప్రసరించేలా సహకరించండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నెంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- పత్రిక ప్రతీ నెల 26వ తేదీన పోస్ట్ చేయబడుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపు చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

- సర్క్యులేషన్ మేనేజర్

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకుడు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.

– సంపాదకులు

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH

Domalguda, Hyderabad - 500 029. Andhra Pradesh

Phone No: 040 - 2766 7799, E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

ఆదర్శ జీవనం అనుసరణీయం!

సమాజంలో నీతి నియమాలతో ధర్మబద్ధంగా జీవితాన్ని కొనసాగించాలనుకొనేవారు ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. మరెన్నో క్లిష్ట పరిస్థితులను అధిగమించాల్సి వస్తుంది. విలువలకే ప్రాధాన్యమిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలనుకొనే వారికి జీవితం మరింత క్లిష్టంగా పరిణమిస్తుంది.

ఆధ్యాత్మిక జీవితాన్ని, సామాజిక జీవితంతో అనుసంధానం చేసి ముందుకు సాగడం నిజంగా సాహసంతో కూడిన పనే అనడంలో సందేహం లేదు. సత్యధర్మాలను ఆచరించేవారు ఏ విషయంలో ఎలా వ్యవహరించాలో, ఏ పరిస్థితుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఎవరితో ఎలా ప్రవర్తించాలో లాంటి ఎన్నో సందేహాలతో సతమతమవుతుంటారు.

ఒక వ్యక్తి నిజాయతీగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నాడు. కానీ కొన్ని సందర్భాల్లో అబద్ధం చెప్పకపోతే వ్యాపారమే దివాలా తీయాల్సి వస్తుంది. అలాంటప్పుడు అతడు పరిస్థితులకు తలొగ్గి అసత్యం చెప్పాలా? లేక సత్యానికే కట్టుబడి ఉండాలా?

ఒకడు ఓ కంపెనీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆ కంపెనీ యజమాని, అతణ్ణి తప్పుడు లెక్కలు వ్రాయమని ఆజ్ఞాపిస్తాడు. ఆ పరిస్థితుల్లో ఆ యజమాని కోరికను మన్నించి తప్పుడు లెక్కలు వ్రాయాలా? లేక నిజాయతీగా జీవించాలని నిర్ణయించుకొని ఉద్యోగానికి రాజీనామా చేయాలా?

ఒక కార్యాలయంలో ఉద్యోగులంతా లంచం తీసుకుంటున్నారు. ఒకతను మాత్రం లంచం తీసుకోకుండా నిజాయతీగా ఉండాలనుకున్నాడు. కానీ లంచం తీసుకోవాల్సిందిగా సహోద్యోగులంతా అతని మీద ఒత్తిడి చేస్తున్నారు. అప్పుడు ఆ ఉద్యోగి పరిస్థితులకు రాజీపడాలా?

సత్యం, ధర్మం, నీతి, నిజాయతీ అంటూ విలువలకే ప్రాధాన్యమిస్తే మన వ్యాపారాలు దివాలా తీస్తాయి, ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది, సహోద్యోగులతో సామరస్యంగా పని చేయడం కష్టమవుతుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో మనం ధర్మబద్ధంగా జీవించడమెలా? సత్యాన్నే ఆలంబనగా చేసుకొని జీవన సాఫల్యాన్ని పొందడమెలా? మన మనస్సులోని అంతరాంతరాళాల్లో మెదిలే ఇలాంటి ప్రశ్నలు అనంతం. ఈ ప్రశ్నలకు జవాబుంది. శ్రీరామకృష్ణ పరమహంస ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి తురీయానందజీ మహరాజ్ ఇడా అన్సెల్ అనే శిష్యురాలుకు చెప్పిన సూత్రమే మనల్ని ఈ సమస్యల నుంచి తరింపజేసే తారక మంత్రం.

In matters of opinion, swim with the current,
In matters of principle, stand firm as a rock.

'ఇతరుల అభిప్రాయాలను ఆమోదించు. కానీ ఆదర్శాల విషయంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా స్థిర చిత్తంతో ఉండు!' – స్వామి తురీయానంద

అభిప్రాయాలకూ, ఆదర్శాలకూ మధ్య తేడా: మనలో చాలా మందికి అభిప్రాయాలకూ, ఆదర్శాలకూ మధ్య తేడా తెలియకపోవడం వల్ల విభేదాలూ, విరోధాలూ చోటు చేసుకుంటూ ఉంటాయి. సాధారణంగా ఇతరులు మన అభిప్రాయాలను అంగీకరించనప్పుడు మనస్సు కలత చెందుతుంది. నిజానికి ఇతరుల అభిప్రాయాలను ఆమోదించడం వల్ల మనకు కలిగే నష్టం ఏమీ లేదని గ్రహించాలి. ఉదాహరణకు రాబోయే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ విజయం సాధిస్తుంది? ఎవరు అధికారంలోకి వస్తారు? ఇలాంటి విషయాల్లో ఎవరైనా తమ అభిప్రాయాలను వ్యక్త పరిచినప్పుడు, వారి భావాలతో మనం ఏకీభవించకపోయినా, వారితో వాదించకుండా ఉండగలిగితే మనఃస్పర్థలకు తావుండదు. అభిప్రాయాల్ని ఆమోదిస్తే చాలు, ఆదర్శాలకు తిలోదకాలిచ్చేవారు మనలో చాలా మంది ఉంటారు. ఇలాంటి స్థితి నుంచి బయటపడాలంటే అభిప్రాయాలకూ, ఆదర్శాలకూ మధ్య తేడా తెలుసుకొని జీవించాలి.

ఆదర్శాల ఆచరణతో అచిర కీర్తి: సత్య ధర్మాల ఆచరణలో ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని దృఢమైన మనసుతో ఎదుర్కొని ముందుకు సాగడానికి ప్రయత్నించాలి. అంతేకానీ, 'మన కళ్ళ ముందే ఎంతోమంది అవినీతికీ, అన్యాయాలకూ పాల్పడుతూ సుఖంగా జీవిస్తున్నారు కాబట్టి మనం మాత్రం ఆదర్శాలు, విలువలు అంటూ జీవితాన్ని ఎందుకు కష్టాలపాలు చేసుకోవడం' అని భావించరాదు.

కేవలం బాహ్య సంపదల వల్లే ప్రశాంతత చేకూరుతుంది అని అనుకుంటే ధృతరాష్ట్రుడికి కావలసిన సంపదలు అన్నీ

ఉన్నా, అతని మనస్సు మాత్రం అశాంతి జ్వాలతో దహించుకుపోయేది. దానికి కారణం అతని అధర్మ వర్తనమే!

వృత్తం యత్నేన సంరక్షేత్ విత్తమేతి చ యాతి చ
అక్షీణో విత్తతః క్షీణో వృత్తతస్తు హతో హతః

'విత్తం (ధనం) పోతే ఎలాగైనా సంపాదించుకోవచ్చు. కానీ వృత్తం (సత్ప్రవర్తన) లేని వ్యక్తి మృతతుల్యుడితో సమానం. కాబట్టి సద్వర్తనతో జీవించాలి'అని విదురుడు, ధృతరాష్ట్రునికి బోధించాడు.

...ఆపత్సు చ న ముహ్యంతి నరాః పండిత బుద్ధయః

బుద్ధిమంతులు పరిస్థితుల ప్రభావాలకు లోను కాకుండా ధైర్యంగా ముందుకు సాగిపోతారు. 'ఎన్నటికైనా సత్యమే జయిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ సత్యాన్ని వీడకు' అంటారు స్వామి వివేకానంద.

Stand firm like a rock. Today or tomorrow or ages after truth will conquer. ***- Swami Vivekananda***

ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ఆదర్శాలను విస్మరించనివారే వివేకవంతులు. అలాంటి మహాత్ములే హరిశ్చంద్రుడు, శిబి చక్రవర్తి, బలి చక్రవర్తి, దధీచి, కర్ణుడు మొదలైనవారు.

కష్టాలకు క్రుంగిపోకుండా, అవమానాలకు అధైర్య పడకుండా సత్యాన్నే ఆలంబనగా చేసుకుని జీవించాడు హరిశ్చంద్రుడు. శిబి చక్రవర్తి ఒక పావురాన్ని కాపాడడానికి తన శరీరాన్నే కోసి ఇచ్చాడు. వామనుడికిచ్చిన మాట ప్రకారం తన ప్రాణమే ఇచ్చాడు బలి చక్రవర్తి. వెన్నెముకను ఇంద్రుడికి ఆయుధంగా ఇచ్చాడు దధీచి. సహజ సిద్ధమైన కవచ కుండలాలను కోసి ఇచ్చాడు కర్ణుడు. వీరంతా ధర్మ పరాయణులు, సత్యవ్రత నిష్ఠులు, సేవానిరతులు, త్యాగధనులు. కాబట్టే వీరి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయింది. వీరి జీవితాలు ఆచంద్రార్కం మనకు ఆదర్శనీయం.

ధర్మమే జీవనం – అధర్మమే మరణం: 'సత్యం వద, ధర్మం చర' – సత్యాన్నే పలుకు, ధర్మాన్నే ఆచరించు అనే శాస్త్ర వచనాలను జీవితంలో ఆచరిస్తే, అప్పుడు –'సత్యమేవ జయతే, ధర్మో రక్షతి రక్షితః' – ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది, ధర్మమే మనల్ని రక్షిస్తుంది అనే విషయం అవగతమవుతుంది.

'ధర్మాన్ని ఆచరిస్తే, ధర్మమే మనల్ని రక్షిస్తుంది' అని నిరూపించిన అన్నదమ్ముల కథ తెలుసుకుందాం.

ఒక నదీ తీరంలో ఇద్దరు అన్నదమ్ములు రెండు కుటీరాలను నిర్మించుకొని అక్కడ జపధ్యానాలు చేస్తున్నారు. ఒక రోజు ఉదయాన్నే తమ్ముడు అన్నగారి కుటీరానికి ప్రక్కన ఉన్న మామిడి చెట్టు నుంచి రెండు మామిడి పళ్ళను కోశాడు. తమ్ముని చేతిలో మామిడి పళ్ళను చూసిన అన్నయ్య విషయం అడిగి తెలుసుకున్నాడు. తమ్ముని సమాధానం విని, 'తమ్ముడూ! నాతో చెప్పకుండా నా కుటీరం వద్ద ఉన్న మామిడి చెట్టు నుంచి పండ్లు కోశావు. ఇతరుల అనుమతి లేకుండా వారి వస్తువులను తీయడం దొంగతనంతో సమానం. కాబట్టి నీవు ఈ అధర్మ కార్యానికి తగిన శిక్ష అనుభవించి తీరాలి' అని అన్న, తమ్ముడితో అన్నాడు.

ధర్మపరాయణుడూ, సత్యసంధుడూ అయిన తమ్ముడు అన్నయ్యతో 'అన్నయ్యా! నేను చేసిన పని తప్పే. నా తప్పుకు తగిన శిక్ష విధించు' అని అన్నాడు. ప్రజలు తప్పు చేస్తే దండించే అర్హత మహారాజుకే ఉంది కాబట్టి, మహారాజుగారి దగ్గరకు వెళ్ళి శిక్షను పొంది రమ్మన్నాడు అన్నయ్య. అన్నగారి మాట ప్రకారం తమ్ముడు, మహారాజుగారి దగ్గరకు వెళ్ళి జరిగిన విషయాన్నంతా వివరించాడు. 'దొంగతనం చేయడానికి ఉపయోగపడినవి చేతులు కాబట్టి రెండు చేతులనూ ఖండించాలి' అని రాజు తీర్మానించాడు. రాజాజ్ఞ ప్రకారం అతని రెండు చేతులనూ ఖండించారు. మొండి చేతులతో కుటీరానికి తిరిగి వచ్చిన తమ్ముణ్ణి, అన్న గాఢంగా కౌగిలించుకుని 'తమ్ముడూ! నువ్వు నదిలో స్నానం చేసి రా' అని చెప్పాడు. తమ్ముడు నదిలో మునిగి పైకి లేచే సరికి రెండు చేతులూ తిరిగి వచ్చాయి. అప్పుడు తమ్ముణ్ణి చూసి అన్నయ్య ఆనందంతో 'ధర్మాన్ని ఆచరిస్తే, ధర్మమే మనల్ని రక్షిస్తుంది' అనే శాస్త్ర వచనాలు నిత్య సత్యాలని అన్నాడు. ఆ అన్నదమ్ములే శంఖ ధర్మశాస్త్రాన్ని రచించిన శంఖుడు, లిఖితుడు.

Conviction of the powers of goodness- మంచితనానికి ఉన్న అఖండమైన శక్తిపై అచంచల విశ్వాసం ఉంటే నీతి నిజాయతీలతో జీవించడం సాధ్యం. అప్పుడే **'ఆదర్శజీవనం అనుసరణీయం'** అనే సంకల్పం మనలో దృఢతరం అవుతుంది. ❖



నేర్చుకోవడం అంటే...

- స్వామి సుప్రియానంద

“మా పిల్లలు చదివిన వాళ్ళు చదివినట్టే ఉంటారు. ఎప్పుడు చూసినా పుస్తకాలు ముందేసుకొని కూర్చుంటారు, తెగ వ్రాస్తుంటారు. స్కూల్‌లో టన్నుల కొద్దీ ఇచ్చిన హోమ్‌వర్క్ చేస్తుంటారు. అయినా పరీక్షల్లో మార్కులు మాత్రం రావడం లేదు” – ఇది పిల్లలపై చాలామంది తల్లితండ్రులు చేసే ఫిర్యాదు.

“ఎక్కాలు వస్తే లెక్కలు వస్తాయి” అన్నది ఎంత నిజమో, “హోమ్‌వర్క్ చేస్తే చదువు వస్తుంది” అన్నది అంతే నిజం.

చదువుకోవడం (Study), అర్థం చేసుకోవడం (Understanding), నేర్చుకోవడం (Learning) – ఇవి విద్యార్జనలోని కీలకాంశాలు. చదువుకోవడం, హోమ్‌వర్క్ చేయడం అన్నవి విద్యార్జనకు ఉపకరణాలు మాత్రమేనని మనం గుర్తించాలి. చదువుకోవడం, హోమ్‌వర్క్ చేయడం అనే ప్రక్రియలు పిల్లవాడు నేర్చుకోవడానికి దోహదపడాలి. కానీ అలా జరగడం లేదు. ఉదాహరణకు ఒక అమ్మాయి ఓ పద్యాన్ని కంఠస్థం చేసి, వాళ్ళ అమ్మ దగ్గరకు సంతోషంగా వెళ్ళి, “అమ్మా! నాకు పద్యం వచ్చేసింది. కాసేపు ఆడుకుంటాను” అంది. ఆ తల్లి కోపంగా “నోర్మూయ్! ఆ పద్యం వస్తే ఇంకో పద్యం చదువు పరీక్షలు దగ్గరకొస్తున్నాయి” అని చెప్పి ఆ అమ్మాయిని హడలగొట్టింది. ఇంతకీ ఆ పద్యం ఏమిటంటే “తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష....!”

నిజంగా ‘నేర్చుకోవడం’అంటే ఏమిటో మహాభారతంలోని ఈ కథలో చూద్దాం! కురుపాండవులు ద్రోణాశ్రమంలో విద్యార్జన చేస్తున్న కాలం. ఒకసారి ద్రోణాచార్యులు పని మీద కొన్ని రోజులు గురుకులం విడిచి వెళ్ళవలసి వస్తుంది. తాను తిరిగి వచ్చేలోపు కొన్ని పాఠాలను శిష్యులకు ‘హోంవర్క్’ గా ఇచ్చి వెళతారు. గురువు గారు తిరిగి రాగానే శిష్యులంతా తాము చదివినదంతా ఏకరవు పెడతారు. ధర్మరాజు మాత్రం తాను ఒక వాక్యాన్ని మాత్రమే చదవగలిగానని చెబుతాడు. ఆ సమాధానం విన్న ద్రోణుడు కోపంతో “ఏమిటి? ఇన్ని రోజులు ఒక్క వాక్యమే చదివావా?” అని గద్దించారు. “అవును గురువర్యా! ఒక్క వాక్యమే చదవగలిగాను. అందులోని విషయాన్నే నేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను” అన్నాడు ధర్మరాజు. అది విన్న ద్రోణుడు మరింత కోపగించుకొని, శిష్యునికి దండన విధించాడు. అయినప్పటికీ ధర్మరాజు ప్రసన్న వదనంతో ఉండడం చూసి ఆచార్యుడు ఆలోచనలో పడ్డారు. మెల్లగా, “నాయనా! నువ్వు చదివిన ఆ ఒక్క వాక్యం ఏమిటి?” అని అడిగారు. ధర్మరాజు పుస్తకం తీసుకొచ్చి గురువుగారికి చూపాడు. “ఎప్పుడూ కోపం తెచ్చుకోవద్దు” అన్నదే ఆ పుస్తకంలో వ్రాసి ఉన్న వాక్యం. ఆచార్యుడి కళ్ళల్లో ఆనందబాష్పాలు. ప్రేమతో శిష్యుడి తల నిమురుతూ, “నాయనా! నువ్వు నాకు ఈ రోజు “నేర్చుకోవడం” అంటే ఏమిటో తెలియజెప్పావు” అన్నారు ద్రోణాచార్యులు. ❖

ఉగాది శుభాకాంక్షలు

‘శ్రీరామకృష్ణ ప్రభ’ పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు మా హృదయపూర్వక శుభాభినందనలు - సంపాదకులు

దుర్గాదేవి దివ్యదర్శనాలు

- స్వామి జ్ఞానదానంద

శ్రీరామకృష్ణులు సర్వవేళలా జగన్మాత చింతనలోనే జీవించేవారు. ఆ జగన్మాత చింతనలో ఆయనకు కలిగిన దర్శన విశేషాల్ని కొన్ని తెలుసుకుందాం.

స్వామి శారదానంద ఇలా వర్ణించారు: "గురుదేవులు ఒక రోజు పంచవటిలో కూర్చొని ఉన్నారు. అప్పుడు దుర్గామాత గంగానదిలో ప్రత్యక్షమై, వారి వైపుగా నడుస్తూ వచ్చి, వారి దేహంలో కలిసి పోయింది. అప్పుడు గురుదేవులు హృదయ్‌తో, "దుర్గామాత వచ్చింది. ఆ తల్లి పాదాల గుర్తులు ఇంకా నేల మీద ఉన్నాయి చూడు" అన్నారు.

దుర్గామాత నీలి కలువ మీద కూర్చున్న దృశ్యాన్ని గురుదేవులు గాంచిన వైనాన్ని రామ్‌లాల్ ఇలా వర్ణించాడు:

"ఒకమారు గురుదేవులు, కేశవ్‌సేన్‌తో కలిసి కలకత్తాలోని ఈడెన్ గార్డెన్‌కు స్టీమర్ మీద వెళ్ళారు. అక్కడ ఒక తటాకంలో ఎన్నెన్నో నీలి కలువ పూలను చూశారు వారు. ఒక పెద్ద నీలి కలువ మీద దుర్గామాత కూర్చొని ఉండడం గురుదేవులకు కనపడింది. ఆమె కుడి పాదం క్రిందికి వేలాడుతోంది. ఎడమ పాదం కలువ మీద ఉంది. ఆమె ఒడిలో గణేశుడున్నాడు. కలువ పువ్వు మెల్లగా కదులుతోంది. ఆ దృశ్యాన్ని గాంచగానే గురుదేవులు సమాధిస్థితికి చేరుకున్నారు".



దేవికి నివేదిస్తున్న ప్రసాదాన్ని శ్రీరామకృష్ణులు స్వీకరించిన సన్నివేశాన్ని అక్షయ్‌సేన్ ఇలా వివరించాడు : "ప్రతీ ఏడూ దుర్గాపూజ (శరన్నవరాత్రులు) సమయంలో కలకత్తాలోని జాన్‌బజారులో ఉన్న తన ఇంటికి గురుదేవుల్ని ఆహ్వానించేవాడు మథుర్‌బాబు. ఒకరోజు గురుదేవులు పూజ గదిలోకి వెళ్ళేసరికి పూజారి దేవికి ప్రసాదం నివేదిస్తున్నాడు. పూజారి నైవేద్యం సమర్పిస్తుండగా, గురుదేవులు అతని చేతి నుంచి తీసుకుని తినడం ప్రారంభించారు. అది చూసి పూజారి ఆశ్చర్యపోయాడు. వెంటనే మథుర్ పూజారితోనూ, ఇతరులతోనూ "గురుదేవులు నైవేద్యం స్వీకరించారు కనుక దుర్గాదేవికి చేస్తున్న పూజ జయప్రదమైంది" అన్నాడు.

దుర్గాపూజోత్సవంలో దుర్గాదేవి దర్శనాలు : భక్తులను అనుగ్రహించిన హృదయ్ ఒకమారు సిహోర్‌లో దుర్గాపూజ ఉత్సవం నిర్వహించాడు. కానీ గురుమహరాజ్ అతనితో పాటు వెళ్ళలేకపోయారు. అయినా హారతి సమయంలోనూ, సంధిపూజ జరుగుతుండగానూ దుర్గామాత ప్రతిమ ప్రక్కన గురుదేవులు నిలబడి ఉన్నట్లు హృదయ్‌కు కనపడింది. తరువాత దక్షిణేశ్వర్ తిరిగివెళ్ళాక గురుదేవులకి తాను చూసిన దృశ్యాన్ని వర్ణించి చెప్పాడు హృదయ్. అప్పుడు గురుదేవులు, "ఆరతి సమయంలోనూ, సంధి పూజ జరుగుతున్నప్పుడూ నువ్వు నిర్వహిస్తున్న పూజ చూడాలనే తీవ్రమైన కోరిక కలిగింది. తేజోమయ దేహంతో అక్కడికి వచ్చి పూజలు తిలకించాను" అన్నారు.

శ్రీరామకృష్ణులు క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం శ్యామ్‌పుకూర్‌లో ఉన్నప్పుడు, తమ సూక్ష్మదేహంతో సురేంద్ర మిత్రా ఇంట్లో జరుగుతున్న దుర్గాపూజ చూడడానికి వెళ్ళారు. వారు తమ భక్తులతో "ఇక్కడి నుంచి సురేంద్ర మిత్రా ఇంటి వరకూ ప్రకాశవంతమైన మార్గం ఒకటి కనబడింది. దుర్గా ప్రతిమలో జగజ్జనని ఉనికిని గుర్తించాను. సురేంద్ర భక్తితో తల్లిని ఆహ్వానించాడు. ఆ తల్లి మూడవ కంటి నుంచి ఒక కాంతి కిరణం ముందుకు ప్రసరించింది. పూజ గదిలో జగన్మాత ఎదుట వరుసగా దీపాలు వెలుగుతున్నాయి. ఇంటి ప్రాంగణంలో సురేంద్ర దయనీయంగా "అమ్మా, అమ్మా!" అంటూ విలపిస్తున్నాడు. మీరంతా వెంటనే అతని ఇంటికి వెళ్ళండి. మిమ్మల్ని చూస్తే అతని మనస్సు శాంతిస్తుంది" అన్నారు. నరేంద్ర (స్వామి వివేకానంద), తదితరులు గురుదేవులకు ప్రణామం చేసి, సురేంద్ర ఇంటికి వెళ్ళడానికి బయలుదేరారు. వారు సురేంద్రను ప్రశ్నించగా, గురుదేవులు సమాధి స్థితిలో గాంచినది అంతా నిజమే అని తెలిసింది. సురేంద్రను అనుగ్రహించడానికి గురుదేవులు సూక్ష్మ దేహంలో అక్కడకు వెళ్ళారని వారికి అర్థమైంది.

నిరంతరం అమ్మ నామస్మరణతోనే జీవించిన శ్రీరామకృష్ణులకు జగన్మాత దివ్యదర్శనాలు కలగడంలో ఆశ్చర్యమేముంది! ❖

(మార్చి 27న ఉగాది)

శోభాయమానం-సకల శుభకరం 'ఉగాది'

తెలుగువారి తొలి పండుగ ఉగాది. నిజానికి, 'యుగాది'కి రూపాంతరం ఉగాది. (కొత్త) యుగానికి ఆది...అంటే ప్రారంభం 'యుగాది'. కలియుగ ప్రారంభాన్ని యుగాది అన్నారు. కృష్ణపరమాత్మ తనువు చాలించిన వెంటనే కలియుగం ఆరంభమైంది అంటారు వేదవ్యాసుల వారు: "యస్మిన్ కృష్ణో దివమ్ వ్యతాహ తస్మాత్ యేవ ప్రతిపన్నమ్ కలియుగమ్."

వసంత ఋతువులో మొదటి నెల అయిన చైత్రమాసంలో మొదటి రోజు యుగాది. వింధ్య పర్వతాలకు ఉత్తరదిశలో ఉన్నవారు బార్హస్పత్యమానాన్ని అనుసరించగా, దక్షిణదిశలో ఉన్నవారు చాంద్రమానాన్ని కానీ, సౌరమానాన్ని కానీ అనుసరిస్తారు. అందువల్లనే ఆ యా ప్రాంతాల వారి క్యాలెండర్లలోని నెలలూ, పండుగలలో తేడాలుంటాయి.

బ్రహ్మదేవుడు వసంత ఋతువులో చైత్ర శుద్ధ పాడ్యమి నాడు ఉషఃసంధ్యలో జగత్తును సృష్టించాడు. కనుక ఆ రోజును ఉగాది అన్నారు. ఉగాదికి సంబంధించిన కథలు పురాణాలలోనూ, చరిత్రలోనూ చాలా ఉన్నాయి. మన పండుగలన్నీ గడచిన సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ జరిపేవే.

ఉగాది నాడు ఎలా గడిపితే ఆ సంవత్సరమంతా అలా గడుస్తుందని ప్రజల నమ్మకం. ఆ రోజు ఆనందంగా గడిపితే సంవత్సరమంతా సుఖసంతోషాలతో గడుస్తుందనే నమ్మకంతో ఉగాది నాడు ఉదయాన్నే పూజ చేసి, దేవుడికి నివేదించిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరిస్తారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులూ మానవ జీవితం సుఖదుఃఖాలు, లాభనష్టాలు, నిందాస్తుతుల మిశ్రమం అని తెలియచేస్తాయి. వీటిని సమదృష్టితో స్వీకరించడం అలవరచుకోవాలన్నదే ఉగాది పచ్చడిని స్వీకరించడంలోని అంతరార్థం. జీవితంలో ఏది ఎదురైనా నిబ్బరంగా, అంతా మన మంచికే జరిగింది అనుకుని మానవ జీవిత లక్ష్యమైన మోక్షాన్ని సాధించాలని కూడా ఈ పండుగ తెలియజేస్తుంది. ఉగాది పచ్చడికి ఔషధ గుణాలు ఉన్నాయి. ఉగాది నాటి పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

చాంద్రమానాన్ని అనుసరించే ఆంధ్రులు, కన్నడిగులు, మహారాష్ట్రీయులకు సంవత్సరంలో మొదటి ఋతువైన వసంత ఋతువు ఆరంభమయ్యే చైత్ర శుక్ల పాడ్యమి నాడు సంవత్సరాది. ఆంధ్రులు, కన్నడిగులూ దీనిని 'ఉగాది' అంటారు, మహారాష్ట్రీయులు 'గుడి పడ్వా' అంటారు.

మన కాలమానం ప్రకారం 60 సంవత్సరాలున్నాయి. వీటిలో మొదటిది ప్రభవ, అరవయ్యోది అక్షయ. ప్రభవతో మొదలైన చక్రభ్రమణం అక్షయతో ముగిసి మళ్ళీ ప్రభవ మొదలవుతుంది. ఆ క్రమంలో ఈ 2009 మార్చి నెల 26వ తేదీతో శ్రీసర్వధారి నామ సంవత్సరం ముగిసి 27వ తేదీ నుంచి శ్రీవిరోధి నామ సంవత్సరం మొదలవుతోంది. ఈ నూతన సంవత్సరంలో విరోధాలు సమసిపోయి, అందరి జీవితాలూ సుఖసంతోషాలతో శోభాయమానం కావాలని ఆశిద్దాం! ❖ – సేకరణ: కుమారి ఎ. శ్రవంతి

శ్రీకృష్ణుడే శ్రీచైతన్యుడు!

- జి. సతీష్

శ్రీచైతన్య మహాప్రభువు 1486 ఫిబ్రవరి 18వ తేదీ నాడు పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాలో మాయాపూర్ గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి జగన్నాథ మిశ్రా పేద వైదిక బ్రాహ్మణుడు, తల్లి శచీదేవి ఆదర్శప్రాయురాలైన ఇల్లాలు.

శ్రీచైతన్య మహాప్రభువు మాతామహుడు పండిత నీలాంబర చక్రవర్తి గొప్ప జ్యోతిష్య శాస్త్రవేత్త. మనుమడు మున్ముందు మహాపురుషుడు కాగలడని గ్రహించిన ఆయన ఆ పిల్లవాడికి 'విశ్వంభరుడు' అని నామకరణం చేశాడు. ఆ పిల్లవాడి దేహచ్ఛాయ బంగారు రంగులో ఉండడంతో, ఇరుగు పొరుగు స్త్రీలు ఆయనకు 'గౌరహరి' అని పేరు పెట్టారు. ఆయన వేప చెట్టు దగ్గర జన్మించడం వల్ల తల్లి ఆయనను 'నిమాయి' అని పిలిచేది.

నిమాయి ఏడ్చినప్పుడు "హరిబోల్" అనగానే ఏడుపు మానేసేవాడట. ఇది భవిష్యత్తులో ఆయన నిర్వహించబోయే నామసంకీర్తనోద్యమానికి సూచన.

మాయాపూర్ గ్రామానికి దగ్గర్లో ఉన్న గంగానగరంలో గంగాదాస పండితుని పాఠశాలలో చైతన్యుడు తన ఎనిమిదో ఏట విద్యాభ్యాసానికి చేరాడు. రెండేళ్ళలో ఆయన సంస్కృత వ్యాకరణం, అలంకార శాస్త్రాలను క్షుణ్ణంగా అభ్యసించాడు. పది సంవత్సరాల వయస్సు దాటేటప్పటికి చైతన్యుడు వ్యాకరణం, అలంకార శాస్త్రం, స్మృతులు, న్యాయశాస్త్రం మొదలైన వివిధ శాఖలలో గణనీయమైన పాండిత్యం గడించాడు.

పదిహేడో ఏట ఆయన శిష్య సమేతుడై గయా క్షేత్రానికి వెళ్ళాడు. అక్కడ ఆయన ఈశ్వరపురి అనే వైష్ణవ సన్న్యాసి నుంచి మంత్రోపదేశం పొందాడు. నదియాకు మరలి వచ్చిన తరువాత నిమాయి పండితుడు ఆధ్యాత్మికతత్త్వ ప్రచారకుడయ్యాడు. ఆయన ఇప్పుడు న్యాయశాస్త్రంలోనూ, స్మృతులలోనూ, అలంకార శాస్త్రంలోనూ వాగ్వివాదానికి సిద్ధపడే విద్వాంసుడు కాదు. కృష్ణ నామం వినగానే తన్మయత్వంతో స్పృహ తప్పి పడిపోయేవాడు.

చైతన్య మహాప్రభువు తల్లి కోరిక మేరకు జగన్నాథ పురీ క్షేత్రంలో ఉండడానికి అంగీకరించాడు. కొన్నాళ్ళ తరువాత ఆయన శాంతిపూర్ నుంచి ఉత్కళ రాష్ట్రానికి ప్రయాణమయ్యాడు.

ఉత్కళాధిపతి అయిన ప్రతాపరుద్రుని సభాపండితులలో ఒకరైన శ్రీవాసుదేవ భట్టాచార్యుడు చైతన్య మహాప్రభువును ప్రసిద్ధమైన 'ఆత్మారామ' శ్లోకాన్ని వ్యాఖ్యానించమనీ, స్వయంగా ప్రభువు నుంచి ఆ వ్యాఖ్యనాలు వినాలని కుతూహలంగా ఉందనీ అర్థించాడు. మొదట భట్టాచార్యుడు ఆ శ్లోకాన్ని తనకు అర్థమైన రీతిలో వ్యాఖ్యానించమనీ, తరువాత తాను వ్యాఖ్యానిస్తాననీ చైతన్య మహాప్రభువు తెలియజేశాడు. భట్టాచార్యుడు తర్క, వ్యాకరణాల ఆధారంగా 'ఆత్మారామ' శ్లోకానికి తొమ్మిది వేర్వేరు అర్థాలను వివరించాడు.

భట్టాచార్యుడు చెప్పిన తొమ్మిది అర్థాలనూ ప్రస్తావించాక చైతన్య మహాప్రభువు ఆ శ్లోకంలోని పదాలను విశ్లేషించి, దానిని వ్యాఖ్యానించాడు. ఆ విధంగా ఆయన ఆ శ్లోకానికి అరవై ఒక్క అర్థాలు చెప్పాడు. చైతన్య మహాప్రభువు వ్యాఖ్యానాన్ని భట్టాచార్యుడు ప్రశంసించాడు. ఆయన సాక్షాత్తూ శ్రీకృష్ణుడే అని భావించాడు. మహాప్రభువును మొదట సామాన్య మానవునిగా భావించి, అపరాధం చేసినందుకు భట్టాచార్యుడు తనను తాను నిందించుకొన్నాడు. చైతన్య మహాప్రభువు చరణారవిందాలపై వాలి, తన అపరాధాన్ని క్షమించి తనపై అవ్యాజమైన కరుణను ప్రసరింపజేయాల్సిందిగా ప్రార్థించాడు. ఆ మహా విద్వాంసునికి గల వినయం చూసి చైతన్య మహాప్రభువు సంతోషించి, మొదట చతుర్భుజాలతోనూ, తరువాత శ్యామ వర్ణంతోనూ, పెదవులపై వేణువుతోనూ కృష్ణునిలా అతనికి తన నిజ స్వరూపాన్ని చూపించాడు. ఈ విధంగా అతనికి చైతన్య మహాప్రభువు షడ్భుజమూర్తి దర్శనం కలిగింది. అప్పుడు సార్వభౌమ భట్టాచార్యుడు మహాప్రభువు పాద కమలాలపై పడి అనేక స్తోత్రాలను రచించాడు. ❖

(మార్చి 11న శ్రీ చైతన్య మహాప్రభువు జయంతి)

దేవీ వైభవం

ప్రవచనం: **శ్రీ సామవేదం షణ్ముఖశర్మ** విలేఖనం: **శ్రీమతి ఎన్. శేషు**

(...గత సంచిక తరువాయి)

చిదగ్నికుండంలో మన అహంకారమంతా ఆహుతి అయితే అప్పుడు అమ్మ సంపూర్ణ చైతన్య స్వరూపం గోచరిస్తుంది. ఆ రూపం ఎలా వచ్చిందంటే-**చంపకాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా, కురువింద మణిశ్రేణి కన్కత్కోటీర మండితా, అష్టమీ చంద్రవిభ్రాజ దళికస్థల శోభితా ...** అలాగ క్రమ క్రమంగా **నఖదీధితి సంఛన్న నమజ్జన తమోగుణా, పదద్వయ ప్రభాజాల పరాకృత సరోరుహా, శింజాన మణి మంజీర మండిత శ్రీపదాంబుజా...** ఇలా అమ్మ సౌందర్యవంతమైన రూపం వచ్చింది. అలా వచ్చిన రూపంలో ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క దేవతా శక్తి ఉంది. అమ్మ యొక్క నల్లని కేశపాశాలలో యముని(కాలం) శక్తి ఉంది. ఇలా ఒక్కొక్క అవయవంలో ఏయే దేవతాశక్తులున్నాయో మనకు లలితోపాఖ్యానం వర్ణించింది. మొత్తంగా అమ్మను ధ్యానిస్తే సర్వదేవతలనూ ధ్యానించినట్లు! ఒక్కొక్క అవయవాన్నీ ధ్యానిస్తుంటే ఒక్కొక్క దేవతా శక్తి మనలో ప్రవేశించి రక్షిస్తుంది. అందుకే శంకరుల వారు – "ధునో ధ్వాంతం నహ.... అమ్మా నీ నల్లని జుట్టును తలచుకుంటే మా మనస్సులో ఉన్న నలుపు పోతుందమ్మా" అన్నారు. అంటే మనస్సులో ఉన్న చీకటి – అజ్ఞానం పోవాలంటే అమ్మ జుట్టును తలుచుకోవాలి. ఆ కాల స్వరూపమే అందులో గోచరిస్తోంది. భగవంతుడి రూపంలో ప్రతి అవయవం ఒక దివ్యశక్తి; ప్రతి అవయవం ఒక తత్త్వ సంకేతం. ఇలా అమ్మ సర్వదేవతామయి అయి గోచరిస్తున్నటువంటిది స్థూల సౌందర్యం.

రెండవది సూక్ష్మ సౌందర్యం.. ఇది మంత్రం. మంత్రం వాచ్యార్థా దేవతా! శబ్దం వల్ల ఉత్పన్నమయ్యే చైతన్యమే దేవత. ఒక శబ్దం ఉచ్చరించగానే ఒక శక్తి ఉత్పన్నమవుతుంది అదే దేవత. మనం ఒక మంత్రాన్ని లేక ఒక నామాన్ని ఉపాసన చేసి ఒక దేవతను ప్రసన్నం చేసుకుంటున్నాం. "సరస్వతి, సరస్వతి, సరస్వతి..." అనగానే మన మనస్సులో సరస్వతీ రూపం కనిపిస్తుంది. మనం నూతిలో చేద వేసి నీరు తోడితే, చేద ఏ రూపంలో ఉందో నీరు ఆ రూపంలో వస్తుంది. అలాగే విశ్వవ్యాపకమైన మహా చైతన్యాన్ని మనం మంత్రమనే చేద వేసి, ఆ మంత్రం చెప్పిన రూపాన్ని పొందుతున్నాం. అమ్మ వారు ఈ రూపంతో ఉన్నారంటే ఈ రూపంలో ఒక మంత్రం ఉంది. ప్రతీ దేవతా రూపంలో ఆ దేవతా సంబంధమైన మంత్రం ఉంటుంది. అలా అమ్మలో ఉన్న మంత్రం పంచదశీ మహామంత్రం.

పంచదశీ మహామంత్రం – వాగ్భవకూటము, కామరాజ కూటము, శక్తి కూటము అని మూడు భాగాలు. ఇది సూక్ష్మ స్వరూపం. అమ్మ వారిని మనం పరిశీలించగానే ఈ మూడూ మనకు అందులో కనిపిస్తాయి. ఆ రహస్యమే మనకు – **శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖపంకజా కంఠాధః కటి పర్యంత మధ్యకూట స్వరూపిణీ, శక్తి కూటైక తాపన్న కట్యథో భాగధారిణీ** – అంటూ మూడూ చూపించారు ఇక్కడ. ముఖం వాగ్భవ కూటం, కంఠం నుండి కటి వరకూ కామరాజ కూటం, కటి నుండి పాదం వరకూ శక్తి కూటం మంత్రం. అందుకే **"మూలమంత్రాత్మికా మూలకూట త్రయ కళేబరా"** అని చెప్పబడుతోంది. అందుకు సూక్ష్మరూపం ఏమిటంటే మంత్రం.

సూక్ష్మ తర రూపం మనలో ప్రాణ శక్తి స్వరూపం. మన ఊపిరితో మంత్రం చెబుతున్నాం. శ్వాసలో నిరంతరం సంచరించే కుండలినీ స్వరూపమే ఆ జగదంబిక. ప్రాణశక్తిని ఆధారంగా చేసుకొనే మంత్రం ఉంది. ఊపిరే లేకపోతే మంత్రం లేదు. ప్రాణశక్తి నుంచి

మంత్రం పలుకుతుంది. నాదం ఉత్పత్తి ప్రాణ శక్తి వల్ల జరుగుతోంది. "ప్రాణానల సంయోగముచే ప్రణవనాదము సప్తస్వరములై బలుకే...." అన్నారు త్యాగరాజస్వామి.

ఈ ప్రాణశక్తే కుండలిని. అమ్మవారు కుండలినీ స్వరూపిణి. అందుకే ఆ తరువాతి నామంలో **"కులాంగనా కులాంతస్థా కౌళినీ కులయోగినీ, అకులా సమయాంతస్థా సమయాచార తత్పరా మూలాధారైకనిలయా బ్రహ్మగ్రంధి విభేదినీ"** అక్కడ నుండి వస్తోంది "బ్రహ్మగ్రంధి విభేదినీ, విష్ణుగ్రంధి విభేదినీ, రుద్రగ్రంధి విభేదినీ. మహా శక్తిః కుండలినీ బిసతంతు తనీయసీ... ఇది సూక్ష్మతరరూపం.

ఆ తరువాతది సూక్ష్మతమరూపం. స్థూలం అంటే కంటికి కనిపించేది – శరీరం, సూక్ష్మం అంటే కనిపించనిది – మనస్సు; దాని కన్నా సూక్ష్మం ప్రాణం, దాని కన్నా సూక్ష్మమైనది పరమాత్మ, అందుకు సూక్ష్మతమ రూపం ఏమిటంటే లలితా సహస్రంలో.... **"నిర్లేపా నిర్మలా నిత్యా నిరాకారా నిరాకులా నిర్గుణా నిష్కళా శాంతా నిష్కామా నిరుపప్లవా"** అని నిఃనిః అనే నిశ్శబ్ద శబ్దాలు అన్నీ సూక్ష్మతమ రూపాలు.

నిరాకారా – ఆమెకు ఆకారం లేదట. ముందేమో "చంపకాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా" అని వర్ణించారు వశిన్యాది వాగ్దేవతలు. అంత ఆకారం వర్ణించి "నిరాకారా నిరాకులా..." అన్నారు. మనలో ఆకారాలకు ఆధారమై ఉన్న నిరాకారం ఆ తల్లి; ఆ ఆధార చైతన్యం. అసలు తత్త్వం ఏమిటి? "నిర్లేపా నిర్మలా నిత్యా నిరాకారా నిరాకులా.." అమ్మ యొక్క స్థూల రూపాన్ని మనం ఉపాసన చెయ్యగా చెయ్యగా సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమ భూములలోకి ప్రవేశించి ఆ పరతత్త్వంలో సాయుజ్యం పొందుతున్నాం. ఎలాగో ఒకలా స్థూల రూపాన్ని ఆశ్రయించగలిగితే అమ్మ తన సూక్ష్మతమ సౌందర్యాన్ని కూడా చూపిస్తుంది. ఆ నాలుగూ చూడగలిగిన వాడే అమ్మను పరిపూర్ణంగా చూసినవాడు. కేవలం బయటి రూపాన్ని చూస్తే చాలదు. లలితా సహస్రం చెప్పినదంతా ఇవే – త్రిపురసుందరి... అరుణవర్ణం... ఈ నాలుగు స్వరూపాలు. ఆది శంకరుల వారు ఆ సౌందర్యలహరినే సౌందర్యలహరి గ్రంథంలా చెప్పారు.

చండీవిద్యలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపాలు చెప్పినట్లే శ్రీవిద్యలో మహాకాళీదేవి వారాహీ స్వరూపంగా కనబడుతోంది. మహా సరస్వతీ దేవి శ్యామలా రూపంగా, మహాలక్ష్మీదేవి లలితా స్వరూపంగా కనబడుతుంది. అలాగే దశమహావిద్యల్లో బగళాముఖి మొదలైన శక్తులన్నీ వారాహీదేవి యందు గోచరిస్తున్నాయి. మాతంగీ విద్య శ్యామలాదేవి యందు గోచరిస్తోంది. ఈ శ్యామలా దేవినే మంత్రిణి పరిసేవితా అని మంత్రిణీ దేవత అన్నారు. **"గేయ చక్రరథారూఢ"** అంటే నాద స్వరూపిణి. శ్యామలా అంటే **"మాణిక్యవీణా ముఫలాలయంతీం మదాలసాం మంజుల వాగ్విలాసాం ..."** ఆవిడ దండినీ దేవత అంటే వారాహి లేక వార్తాళి అని చెప్పబడుతున్నది. ఈ వార్తాళి దేవి, శ్యామలా దేవి– ఇద్దరూ రక్షకులు. ఆత్మ చైతన్యం అమ్మ అయితే మనలోని బుద్ధి శక్తి శ్యామల, మన శరీరంలో ఉండే రక్షణ వ్యవస్థ అంతా వారాహీ దేవి. ధర్మ రక్షణ వారాహీ దేవి పని. బుద్ధి, జ్ఞానం ఇవన్నీ శ్యామలా దేవి పని. ఈ రెండిటికీ ఆధారమైన లలితా దేవి ఆత్మ చైతన్యంగా భాసిస్తూ ఉంది. ఆ విధంగా ఇక్కడ కూడా ముగ్గురే. ఎటు చూసినా లలితా త్రిపురసుందరిని దర్శించడమే ప్రధానం. అందుకే హయగ్రీవులవారు అగస్త్యుల వారికి అంతా చెప్పి **"స్వాత్మైవ దేవతా ప్రోక్తా లలితా విశ్వ విగ్రహా"** అన్నారు. ❖

సశేషం

పరిప్రశ్న

- స్వామి సుకృతానంద

జి. సతీష్, వేములవాడ.

? : ఉదయం నిద్ర లేచినప్పుడు, రాత్రి పడుకునే ముందు, భోజన సమయంలో పఠించవలసిన ప్రార్థనా శ్లోకాలు వివరించండి.

✍: **ఉదయం మేల్కొనగానే:** మీ ఇలవేల్పు, ఇష్టదేవత, లేదా శివ, దుర్గ, విష్ణువు, శ్రీరామకృష్ణులు, శారదామాత... ఎవరినైనా ముందుగా తలచి, క్రింది శ్లోకాలు పఠించాలి.

కరాగ్రే వసతే లక్ష్మీ, కర మధ్యే సరస్వతీ,
కర మూలే స్థితే గౌరీ, ప్రభాతే కరదర్శనమ్.

సముద్రవసనే దేవీ, పర్వతస్తన మండలే, విష్ణుపత్నీ
నమస్తుభ్యం, పాద స్పర్శం క్షమస్వమే.

భోజన సమయంలో: *"బ్రహ్మార్పణం బ్రహ్మ హవిర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్, బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా హరిః ఓం తత్ సత్."*

రాత్రి నిద్రపోయే ముందు: "కాయేన వాచా మనసేంద్రియై ర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్వభావాత్,
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణా యేతి సమర్పయామి"

"అసతో మా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతంగమయ, ఓం శాంతిః శాంతిః శాంతిః"

అనునిత్యం కనీసం ఈ విధంగా పరమాత్ముని ప్రార్థన చేస్తే మనసుకు శాంతి సంతోషాలు కలుగుతాయి. నిత్యం చేసే పనులు సవ్యంగా జరుగుతాయి.

కె. వి. రామదుర్గయ్య, నెల్లూరు.

? : ఆధ్యాత్మిక గురువులు శిష్యులకు మంత్రోపదేశం చేస్తారు. ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ అనే భగవన్నామ స్మరణకు గురుముఖతః ఉపదేశం అవసరమా?

✍: ఆధ్యాత్మిక జీవితం గడపడానికి మంత్రోపదేశం అవసరం. శ్రీరామ, శ్రీకృష్ణ నామోచ్చారణకు గురువు ద్వారా మంత్రోపదేశం అవసరం లేదనుకొంటారు. అది సరి కాదు. ఉపనయన సమయంలో గాయత్రీ మంత్రాన్ని పురోహితుడు, లేదా తండ్రి ద్వారా స్వీకరించిన వారిలో ఎవరో కొందరు తప్ప మిగతా వారందరూ గురువు ద్వారా మంత్రోపదేశం పొందాలి. గురువు ద్వారా పొందే మంత్రోపదేశంలో, గురుపరంపరగా వస్తున్న గురుశ్శక్తి సాధకుడికి లభిస్తుంది. సాధన సులభమవుతుంది. సందేహ నివృత్తి అవుతుంది. కేవలం భగవన్నామ జపం చేసేవారు ఎక్కువ శ్రమపడాలి. సందేహాలు నివృత్తి కావు. ఒక భగవన్నామం కొంతకాలం చేసి, మరలా ఇంకో మంత్రం, లేదా ఇతర మంత్రాలు జపించే వారు గతి తప్పిన పడవ, గమ్యం లేని గాలిపటంలా ఉంటారు. లక్ష్యసిద్ధికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో గురువు ద్వారా మంత్రోపదేశం తప్పనిసరి చేశారు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు, గురువే పరబ్రహ్మ! అలాంటి గురువుకు మళ్ళీ మళ్ళీ నా నమస్కారాలు అని ప్రార్థిస్తున్నాం. పరమాత్మే గురువు రూపంలో వస్తాడంటారు శ్రీరామకృష్ణులు.

జి. హెచ్. రావు, తాలుపూరు.

? : పాషండుడు, పతితుడు అంటే ఎవరు? వారు దైవసాయుజ్యాన్ని పొందుతారా?

✍: శీలం, నడవడిక సరిగ్గాలేకుండా తప్పుత్రోవ పడినవారిని పతితుడు అంటారు. వారు ఆదర్శం నుంచి వైదొలగినవారు. సతతం తననే అర్చించి, స్మరించే వారిని సాధువుగా స్వీకరించాలంటాడు కృష్ణ భగవానుడు. పాషండుడు అంటే దక్షిణ భారతదేశంలో ఒక తెగవారిని అలా పిలుస్తారు.

భగవన్నామ స్మరణతో ఎవరైనా ఆయన్ని పొందవచ్చు. ❖

ధీరవాణి

-స్వామి వివేకానంద



దుఃఖాలకు అసలు కారణం..

మన దుఃఖమంతా మనం కోరి తెచ్చుకొన్నదే. చైనాదేశంలో అరవై సంవత్సరాలు కారాగారంలో బంధించబడిన ఒక వృద్ధుణ్ణి ఒక చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవ సందర్భాన విడుదల చేశారు. అతడు బయటకు వచ్చి "ఇక్కడ బ్రతకలేను. కారాగారంలోని చిట్టెలుకలు, చుంచెలుకల మధ్యకు వెళ్ళిపోతాను. ఈ వెలతురు నాకు దుస్సహంగా ఉంది. నన్ను చెరసాలలోకైనా పంపేయండి లేదా చంపేయండి" అని మొరపెట్టుకున్నాడు. తిరిగి అతణ్ణి కారాగారానికి పంపేశారు.

మానవులందరి పరిస్థితీ సరిగ్గా ఇలాగే ఉంది. అనేక రకాలైన దుఃఖాల వెంట పడుతుంటాం. వాటి నుంచి బయటపడటానికి ఇష్టపడం. అనుదినం మనం సుఖం వెంట పరుగెత్తే కొద్దీ అది మనకు లభించకుండా అదృశ్యమై పోతుంది.

నువ్వుల నుండి నూనె తీసే గానుగలను తిప్పడానికి ఎడ్లను కడతారు. ఎద్దు మెడపై కాడి ఉంటుంది. కాడి నుంచి ముందుకు పొడుచుకొని వచ్చినట్లుగా ఒక కొయ్య ముక్క ఉంటుంది. దానిపైన కొంత గడ్డిని వ్రేలాడగడతారు. ఎద్దు కళ్ళకు కట్టిన గంతల వల్ల ఎద్దు ముందుకే చూడగలదు. గడ్డి నందుకోవడానికి అది మెడను ముందుకు చాస్తుంది. ఆ కొయ్య ముక్క ముందుకి కదులుతుండడం వల్ల అది గడ్డిని అందుకోలేదు కానీ, అందుకొనే ఆశతో చుట్టూ తిరుగుతూ ఉంటుంది. అలా తిరగడం వల్ల గానుగ నుండి నూనె వస్తుంది.

అలాగే మనందరం సుఖభోగాలనే ఈ గడ్డి చుట్టను సదా వెంటాడుతున్నాం. మనం తిరిగే చుట్లే మనమెత్తే అసంఖ్యాకమైన జన్మలు. మనం కోరేవేమో మనకు లభించవు. మనం ఎప్పుడూ కోరుకున్నది సుఖాన్ని మాత్రమే. కానీ సుఖం వైపు మనం వెళ్ళేకొద్దీ, అది మనకు దూరమై పోతుంది. ఈ నిజాన్ని మనం తెలుసుకోలేక కష్టాల పాలవుతున్నాం. మీ జీవితాలను పరిశీలించుకోండి. అందులో సుఖమెంత ఉందో గమనించండి. లోక ప్రవృత్తి అనే ఈ అడవిబాతు వేటలో నిజానికి మీకు కలిగిన లాభమెంతో గుర్తించండి.

నిజానికిక్కడ సుఖమెవరికీ లేదు, ఎప్పుడూ లేదు. ఒకడు సంపన్నుడై తినడానికి పుష్కలంగా ఉంటే అతని జీర్ణకోశం పాడై ఉంటుంది. అతడు తినలేడు. ఇంకొకనికి జీర్ణశక్తి బాగున్నా, సముద్రపు కాకిలా జీర్ణించుకోగలిగిన శక్తి ఉన్నా, అతనికి తినడాని కేమీ ఉండదు. ధనం ఉంటే బిడ్డలుండరు. ఆకలితో మాడిపోతున్న పేదవాడికి ఇంటి నిండా పిల్లలుంటారు. వారిని పెట్టుకొని ఏమి చేయడానికీ అతనికి పాలుపోదు. ఇలా ఉండడానికి కారణమేమిటి? అందుకు కారణం – సుఖం, దుఃఖం ఒకే నాణానికి ఉన్న బొమ్మా, బొరుసుల్లాంటి వన్న నిజాన్ని విస్మరించడమే. సుఖాన్ని కోరుకునేవాడు దుఃఖాన్ని కూడా భరించాలి. దుఃఖం లేని సుఖాన్ని కోరుకోవడమే మన దుఃఖాలకు అసలు కారణం. ❖

పరమేశ్వరుని పరిరక్షణలో ...

స్వామి జపానంద స్వీయ అనుభవాలు -21

(...గత సంచిక తరువాయి)

భగవంతుని మీదే భారమంతా!

స్వామి జపానంద పంజాబ్‌లో చంబా కొండ మీద నుంచి పఠాన్‌కోట వెళుతున్నారు. అది వర్షాకాలం. జోరుగా వాన పడుతోంది. చేతిలో గొడుగు లేదు. ఒక పల్చని కంబళి మాత్రం ఉంది. అదే తల మీద నుంచి కప్పుకున్నారు. అయితే అది కూడా వర్షపునీటితో తడిసి పోయి బరువెక్కుతోంది. మాటి మాటికీ దాన్ని పిడిచి, కప్పుకుంటున్నారు. సుమారు పన్నెండు మైళ్ళ దూరంలో ఒక గ్రామం ఉంది. అంతవరకూ ఉండడానికి ఎక్కడా సరి అయిన చోటు లేదు. అలా నడుస్తూ గ్రామం పొలిమేరల్లోకి చేరుకున్నారు. దూరం నుంచి ఇళ్ళు కనిపిస్తున్నాయి. గ్రామంలోకి ప్రవేశించడానికి ఒక చిన్న వంతెన దాటాలి. అయితే అటు దోవ అంతా నీటితో నిండిపోయి ఉంది. ఎక్కడా నేల కనిపించడం లేదు. ఏమిటి చెయ్యడమా అని ఆలోచిస్తూ చుట్టూ చూశారు. ఒక కాలిబాట కనిపించింది. అది నది దగ్గర వరకూ ఉంది. అక్కడ కొండ మీద నుంచి ఒక జలపాతం వచ్చి, కింద నదిలో కలుస్తోంది. గ్రామంలోకి వెళ్ళాలంటే వంతెన దాటాలి. లేదంటే పక్కనే ఎత్తయిన కొండ మీదకు ఎక్కి అటువైపు దిగి వెళ్ళాలి. రెండోది సాధ్యం కానిది. సన్న్యాసి కాలి బాటలో నది దగ్గరకు వెళ్ళారు. నదిలో నీళ్ళు ప్రచండమైన వేగంతో ప్రవహిస్తున్నాయి. వంతెనకు నీళ్ళు తగులుతూ ఉన్నాయి. కొండ మీద నుంచి జలపాతం కూడా తీవ్రమైన వేగంతో కిందకు దూకుతోంది. ఏ మాత్రం కాలు జారినా చంబల్ నదిలో పడే అవకాశం ఉంది. బండల మీద నుంచి దుముకుతూ నది ప్రవహిస్తోంది. హోరున కురుస్తున్న వానలో సాయం చేసే మానవమాత్రుడెవరూ కనిపించ లేదు. వంతెన దాటడమే ఏకైక ఉపాయం అని నిశ్చయించుకున్నారు. ఆ ప్రయత్నంలోనే నది వైపు అడుగులు వేశారు. అయితే మొదటి అడుగుకే కాలు బురదలో కూరుకుపోయింది. చేతిలో ఉన్న కర్ర కూడా సగానికి పైగా బురదలోకి వెళ్ళిపోయింది. ఆయన అక్కడే అలాగే అసహాయంగా నిల్చుండి పోయారు. కాళ్ళ దగ్గర జలపాతం నుంచి నదిలోకి పడుతున్న నీటి వేగం, పైన వాన దేవుడు కురిపిస్తున్న వాన, హిమాలయ ప్రాంతాలలో వీచే చల్లటి మంచుతో కూడిన గాలి, తడిసి ముద్దయిపోయిన వస్త్రాలు, ఇక్కడ నుంచి బయట పడడం అసంభవం. ఇక మృత్యువే దారి అనుకొని, కళ్ళు మూసుకొని దైవస్మరణ చేసుకుంటున్నారు.

ఇంతలో భయంకరమైన శబ్దం అయింది. కళ్ళు తెరిచి చూస్తే తాను నిల్చొని ఉన్న చోట పైన జలపాతంతో పాటు రాళ్ళు, మట్టి, బురద జారి ఆయన వైపుగా వస్తున్నాయి. అంతే ఇంక ఈ రాళ్ళ కింద సమాధి అయిపోవడం ఖాయం అనుకున్నారు. కానీ ఆశ్చర్యం! పెద్ద పెద్ద బండలు వారికి అడుగు దూరం వరకూ వచ్చి ఆగిపోయాయి. అప్పుడే వర్షం తగ్గుముఖం పట్టింది. దగ్గరలోనే వచ్చి ఆగిన బండరాయి మీద చెయ్యి వేసి ఆనుకుని బురదలో కూరుకుపోయిన కాళ్ళు బయటికి తీశారు. రాళ్ళు, మట్టి అంతా చేరి అక్కడ నడవడానికి తోవ ఏర్పడింది. ఆ బాటలోనే నడిచి ఆ జలపాతం దాటి అవతల వైపు వెళ్ళగలిగారు. భగవంతుడి లీలలు అనూహ్యమైనవి అనుకుంటూ వంతెన వైపు నడిచారు. అక్కడ నుంచి గ్రామం కనిపిస్తోంది.

వంతెనకు ఇటువైపు ఒక చిన్న దుకాణం ఉంది. అక్కడ మామూలుగా అవసరమైన కిరాణా సామగ్రి, బట్టలు లాంటివి అమ్ముతారు. అక్కడికి వెళితే ఆ కొట్టు యజమాని ఇలా అన్నాడు: "వంతెన దాటడానికి లేదు. నదిలో నీటి మట్టం పెరగడంతో వంతెన కొట్టుకుపోతుందని భయంతో తాళాలు వేస్తారు. అటు వెళ్ళడం అపాయంతో కూడుకున్న పని". అది విని స్వామి అన్నారు "తాళం చెవి ఉంటే తియ్య కూడదా! ఊళ్ళోకి వెళ్ళిపోతాను. ఇక్కడ ఎక్కడ ఉంటాను?" అన్నారు. అంతలో లోపల నుంచి మరొక వ్యక్తి వచ్చి సాధువును చూసి, "రండి స్వామీజీ రండి! మీరు పూర్తిగా తడిసిపోయి ఉన్నారు. దోవ లేదు కదా ఎలా వచ్చారు? బాగా చలిగా ఉంది. రండి! ఈ మంట దగ్గర కూర్చొని చలి కాచుకోండి. తడి బట్టలు ఆరపెట్టుకోండి. ఇలాగే ఉంటే జలుబు చేసి న్యుమోనియాలోకి దింపుతుంది. మీరు టీ తాగుతారు కదా!" అంటూ ఆయన చెయ్యి పట్టుకుని సాదరంగా లోపలికి తీసుకెళ్ళాడు. "తడి బట్టలు వదిలి ఇదిగో ఇవి కొత్త బట్టలు, ఇవి కట్టుకోండి. ఈ కొత్త కంబళి కప్పుకోండి" అన్నాడు.

చలి మంట దగ్గరలో రెండు, మూడు కంబళీలు పరిచి "ఇలా కూర్చోండి! వెచ్చగా ఉంటుంది" అని చెప్పి, టీ కలిపి ఇచ్చాడు. టీ తాగిన తరువాత, "స్వామీజీ! ఇంక మీరు నిద్రపోండి. అలసట తీరుతుంది. రేపు వంతెన గేటు తెరిస్తే మీరు ఊళ్ళోకి వెళ్ళవచ్చు. ప్రస్తుతం వర్షం ఆగింది. రాత్రంతా వాన పడకపోతే నదిలో నీరు తగ్గుతుంది. వంతెన తెరుస్తారు. ఇప్పుడు మీరు హాయిగా నిద్రపోండి" అన్నాడు.

సన్న్యాసి (స్వామి జపానంద) బాగా అలసిపోయి ఉన్నందువల్ల కంబళి మీద వాలగానే నిద్రపోయారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ బాగా నిద్రపోయారు. నిద్ర లేచేటప్పటికి ఆ దుకాణం యజమాని, అతని తమ్ముడు అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒకతను వచ్చి వేడి నీళ్ళు అందించి "ముఖం కడుక్కుని రండి మహరాజ్! వంట అయింది". అని భోజనానికి పిలిచాడు. స్వామికి చాలా ఆకలిగా ఉంది. కాళ్ళు చేతులూ, ముఖం కడుక్కుని వచ్చి భోజనం చేశారు. వంట అమృతంలా ఉందనిపించింది. మాట్లాడాలని అనిపించలేదు.

మధ్యాహ్నం జరిగిన సంఘటనలే మనస్సులో తిరుగుతున్నాయి. బండరాళ్ళ కింద సమాధి అయిపోతానని అనిపించిన మరుక్షణం అవే జలపాతం దాటడానికి దారి చూపాయి. ఈ అన్నదమ్ముల రూపంలో భగవంతుడు సహాయం అందించాడు. భోజనం అయిన తరువాత స్వామి జపానంద పడుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆయనకు మెలకువ వచ్చేసరికే వాళ్ళిద్దరూ నిద్ర లేచారు. వర్షం కురుస్తూనే ఉంది. స్వామి బట్టలు, కంబళి ఆరపెట్టి వారి దగ్గరలోనే ఉంచారు. స్నానాదికాలు ముగించుకొని వచ్చాక, వేడి టీ ఇచ్చారు. "వర్షం తగ్గే సూచనలు ఏమీ లేవు. నది దాటలేరు. వంతెన గేటు తెరవరు. మనందరం కూర్చుని సత్సంగం చేసుకుందాం" అన్నారు. మధ్యాహ్నం వరకు అనేక ధర్మసందేహాలు అడిగి తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక చర్చలు చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు ముగిసేసరికి వర్షం తగ్గింది. అవతలి వైపు నుంచి పోలీసు జవాను గేటు తెరవమన్నాడు. గేటు తెరవగానే వాళ్ళకు ధన్యవాదాలు అర్పించి సన్న్యాసి సెలవు తీసుకున్నారు. ❖

(మిగతా వచ్చే సంచికలో...)

(మిగతా వచ్చే సంచికలో...)

అనువాదం : శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

పండుగలు - పర్వదినాలు

మార్చి- 2009

07	శనివారం	:	ఏకాదశి
11	బుధవారం	:	శ్రీ చైతన్య మహాప్రభువు జయంతి
14	శనివారం	:	స్వామి యోగానంద జయంతి
22	ఆదివారం	:	ఏకాదశి
27	శుక్రవారం	:	ఉగాది

ఏప్రిల్- 2009

03	శుక్రవారం	:	శ్రీరామనవమి
05	ఆదివారం	:	ఏకాదశి
21	మంగళవారం	:	ఏకాదశి
27	సోమవారం	:	అక్షయ తృతీయ
29	బుధవారం	:	ఆది శంకరాచార్యుల జయంతి

మూగజీవులకూ ముక్తిని ప్రసాదించిన మహర్షి

మూలం : సద్గురు శ్రీరమణ మహర్షి చరిత్ర | చిత్రాలు : గోవి | తెలుగుసేత : స్వామి జ్ఞానదానంద








4
స్వామీ! నా బిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. దయతో మీరే అతనికి ప్రాణభిక్ష పెట్టండి.
చనిపోయిన కోతిని ఇక్కడకు తెచ్చిన కోతులకు స్వాంతన కలిగించాను, అంతే! మీ బిడ్డను ఒక మంచి వైద్యుని వద్దకు తీసుకెళ్ళండి!
5
స్వామీ! నా భర్త లేకుండా నేను జీవించలేను. దయచేసి మీరే ఆయన్ని కాపాడాలి!
అలాంటి శక్తి నాకు లేదమ్మా!
స్వామీ! మీరు విభూతి మంత్రించి ఇస్తే నా కుమారుడు బ్రతుకుతాడు.
సరేనమ్మా! ప్రయత్నిస్తాను.
6
అందరూ అలా వేడుతుంటే మహర్షికి వారి పట్ల జాలి కలిగింది. పొయ్యిలోంచి కొద్దిగా బూడిదను తీసుకొచ్చి....
అమ్మా! ఇదిగో ఈ బూడిదను నీ బిడ్డకు పూయి! అంతా బాగవుతుంది!
7
ఆ బూడిద పూసిన వెంటనే ఆ యువకుడు పూర్తిగా కోలుకున్నాడు. ఆ యువకుడు అలా హఠాత్తుగా జబ్బు పడినందుకు అతడు ఆ రోజు ఉదయం చేసిన ఒక పనే కారణం. అది...
8
శ్రీరమణ మహర్షి పట్ల భక్తులే కాక జంతువులు కూడా ఆకర్షింపబడేవి. కోతులతో ఆయన సంభాషించేవారు. వారి మాటలను కోతులు కూడా వినేవి. అవి కొట్లాడుకుంటే వాటి తగాదాలను ఆయన తీర్చేవారు!
ఇటు చూడండ్రా! తోటకు వెళ్ళినప్పుడు పోట్లాడుకోకూడదు!
9
కోతులు రోజూ చింతగింజలు తినడానికి తోటకు వెళతాయి. ఆ ఇస్లామ్ యువకుడు ఒక జాటీ పట్టుకుని తోటకు కాపలా కాస్తున్నాడు.

మిగతా 36వ పేజీలో...

గురువునే పరీక్షించిన శిష్యుడు

శిష్యులకు ఏం బోధిస్తాడో దాన్ని తాను స్వయంగా ఆచరించి చూపేవాడే నిజమైన గురువు. బోధనలకూ, ప్రవర్తనకూ పొంతన లేని గురువును జనం ఎంత మాత్రం విశ్వసించరు. ఈ కారణం వల్లనే, వ్యాపారస్థులు రూపాయి నాణాన్ని మ్రోగించి పరీక్షించిన విధంగా తనను కూడా పరీక్షించిన తరువాతనే గురువుగా అంగీకరించాల్సిందిగా శ్రీరామకృష్ణులు తన శిష్యులను హెచ్చరించేవారు.

స్వామి యోగానంద

ఒకరోజు యోగీంద్రుడు (స్వామి యోగానంద) శ్రీరామకృష్ణుల గదిలో నిద్రిస్తున్నప్పుడు అర్ధరాత్రి అతడికి మెలకువ వచ్చింది. అప్పుడు గదిలో శ్రీరామకృష్ణులు కనిపించలేదు. ఒకవేళ గురుదేవులు బయట పచార్లు చేస్తున్నారేమో అని యోగీంద్రుడు తలచాడు. కానీ, శ్రీరామకృష్ణులు అక్కడా అగుపించలేదు. అంతలోనే హఠాత్తుగా అతడి మనస్సులో శ్రీరామకృష్ణుల గురించి ఒక ఘోరమైన అనుమానం తలయెత్తింది. 'గురుదేవులు నహబత్‌కి పోలేదు కదా? (ఆ రోజుల్లో శారదాదేవి 'నహబత్'లో నివసించేవారు) ఎల్లప్పుడూ కామినీ కాంచనాల పరిత్యాగం గురించి చెప్పే గురుదేవుల మాటలకు ఆయన చర్యలు విరుద్ధంగా ఉండడం సంభవమా?' అని యోగీంద్రుడు అనుకున్నాడు.

నిజం ఏమిటో నిర్ధారించుకోవాలని యోగీంద్రుడు 'నహబత్' సమీపంలో నిలబడి పరిశీలించసాగాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు పంచవటి నుంచి రావడం చూశాడు యోగీంద్రుడు. గురుదేవులు "నువ్వు ఇక్కడ ఎందుకు నిలబడ్డావు?" అని యోగీంద్రుణ్ణి ప్రశ్నించారు. గురుదేవుల శీలాన్ని శంకించినందుకు సిగ్గుతో తలవంచుకుని మౌనంగా ఉండిపోయాడు. యోగీంద్రుని మనసుని గ్రహించిన శ్రీరామకృష్ణులు "నువ్వు చేసింది మంచి పనే. సాధువు విషయంలో విశ్వాసం పెంచుకునే ముందు అతణ్ణి అనేక రోజులు రాత్రింబవళ్ళూ పరీక్షించాలి" అని అన్నారు. ❖

(మార్చి 14న శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన **స్వామి యోగానంద జయంతి**)

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & పక్యాల గిరిజ, డైరక్టర్

SVISS LABSS LTD.,

(Manufacture of Bulk Drugs / Drugs Intermediates)
An ISO 9001 : 2000 Certified Company

No.88-89, Phase - II, Sipcot Industrial Complex,
Ranipet - 632 403, Tamil Nadu.

Web Site : www.svisslabss.com
E-Mail : rao@svisslabss.com

"Are you growing spiritually? Can you love others? Can you feel oneness with others? Have you peace within yourself? And do you radiate it around you? That is called spiritual growth, which is stimulated by meditation, inwardly, and by work done in a spirit of service outwardly." - *Swami Ranganathananda*

ADVT.

జగత్తుకు కారణం బ్రహ్మమా?

శ్రీరాముడు: మహర్షీ! "మాయ వల్ల విజృంభిస్తున్న ఈ జగత్తుకు మూలకారణం బ్రహ్మమే. సర్వానికీ కర్త బ్రహ్మమే" అని లోకంలో వ్యవహరించబడుతోంది కదా!

శ్రీవశిష్ఠ మహర్షి: అవును. అలా లోకరీతి ఉన్నమాట నిజమే, కానీ అవి బోధించడానికే చెప్పబడుతున్నాయి. "ఈ 'జగత్తు' అనబడేది లేదు" అనే సత్యానికి సంబంధించిన దృఢనిశ్చయం ఏర్పడే వరకే అలా చెప్పడం.

ఇక్కడ నీకు ఒక దృష్టాంతం చెబుతాను విను. దర్పణంలో – ఎదురుగా ఉన్న వస్తుజాలం, ఆ వస్తువుల కదలికలు ప్రతిబింబిస్తాయి కదా! ఆ దర్పణం తనలో ఎలాంటి ఇచ్ఛాద్వేషాలూ, ప్రియ – అప్రియాలూ, రాగ–విరాగాలూ లేకుండానే ప్రతిబింబింపజేస్తోంది. అంటే, "నేను ఈ వస్తువులనే చూపిస్తాను, వాటిని చూపను. ఎందుకంటే, అవి నాకు ఇష్టం కాదు..." అనేది ఆ అద్దానికి ఉండదు. అందుచేత, ఆ ప్రక్రియ యొక్క కర్తృత్వాన్ని దర్పణానికి ఆపాదించలేం. సామీప్యత – సన్నిధానాల వల్లనే దృశ్యం అద్దంలో ప్రతిబింబిస్తోంది. అంతమాత్రం చేత ఆ ప్రతిబింబిస్తున్నది అద్దంలోని భాగమని కూడా అనలేం కదా! అలాగే, సామీప్యత – సన్నిధానం కారణంగా ఈ 'జగత్తు' అనబడేది వెలిగించబడడం వల్ల "ఈ జగత్తుకు కారణం ఆత్మచైతన్యం" అని చెప్పబడుతోంది. అద్దమే లేకపోతే ప్రతిబింబమే లేనట్లు, ఆత్మచైతన్యమే లేకుంటే 'జగత్తు' అనే అనుభవం ఎవరికి? కానీ, ఈ జగత్తు ఆత్మ యొక్క ఒక శరీరభాగమని అనడానికి వీలు లేదు.

ఒక బీజం నుంచి అంకురాలు, ఆకులు, ఫలాలు ఉత్పన్నమైనట్లు, 'చిత్తు' నుండే చిత్తం – జీవులు – మనసులు .... అంతా కలుగుతున్నాయి. ప్రళయసమయంలో సృష్టి – రహితమై 'శుద్ధ చిత్తు' శేషిస్తోంది. ప్రళయానంతరం తిరిగి "సృష్టి"... ఆకారంలో వివర్తం చెందుతోంది. అంకురశక్తి మౌనంగా నిదురించియున్న బీజంలో నుంచి వృక్షంగా, తిరిగి ఆ వృక్షంలో నుంచి బీజంగా ఉత్పన్నమవడం లేదా? ఇది కూడా అలాంటిదే.

బీజంలో ఉన్న "వృక్షాన్ని జనింపజేయగల శక్తి" బ్రహ్మంలో ఉన్నటువంటి "జగత్తును జనింపజేయగల శక్తి".... ఈ రెండూ ఒక రకంగా సమానమైనవే. అయితే ఆ రెండింటి మధ్య ఒక భేదం ఉంది. 'బీజం' కన్నా వేరుగా 'వృక్షం' అనేది ప్రాప్తిస్తోంది కదా! కానీ బ్రహ్మానికి సంబంధించిన జ్ఞానం ఉదయించిన తరువాత "బ్రహ్మం కన్నా వేఱుగా విశ్వం లేదు" అనే బోధ ఏర్పడుతోంది.

దీపం ప్రకాశిస్తూ ఉండగా, ఆ దీపపు కాంతిలో వస్తువులు కనబడతాయి. కానీ "ఆ దీపమే ఈ వస్తువులను మాకు చూపుతోంది" అని అనగలమా? అనలేం. ఎందుకంటే, "ఈ వస్తువులను ఈతనికి చూపాలి. ఇవి ఈతనికి చూపకూడదు" అనే ఇచ్ఛ ఆ దీపానికి లేదు కదా! అయితే దీపమే లేకుంటే చూడనే లేమే! బ్రహ్మం సమక్షంలో ఈ జన్మాదులు, భావాభావాలు ఉంటున్నాయి; లేకుండా పోతున్నాయి కూడా. అయితే "వీటికి బ్రహ్మం కారణం" అని అనలేం. కానీ, బ్రహ్మమే లేకుంటే ఇక ఈ జగత్తు, జన్మ మృత్యువులు మొదలైనవన్నీ పొందేదెవరు? కాబట్టి, బ్రహ్మం ఉన్నందుకే జగద్వ్యవహారం, తదితరాలు ఉంటున్నాయి.

ఒక పిల్లవాడు ఒక అద్దంలోనో, లేక స్ఫటిక శిలాఖండంలోనో ప్రతిబింబిస్తున్న ఆకాశంలోని చంద్రుణ్ణి చూసి "ఈతడే అసలు చంద్రుడు, ఇతనిని మనం పట్టుకోగలం" అని అనుకుంటూ ఉంటాడు చూశావా? అవిద్యా మోహితులైన వారు మాత్రమే బ్రహ్మంలో 'జగత్తు'ను గాంచుతున్నారు. స్ఫటిక శిలాఖండంలో స్ఫటిక పదార్థమే ఉంది కానీ చంద్రుడు ఉన్నాడా?

కాబట్టి ఓ రామచంద్రా! నీకు కనబడుతున్న 'ప్రపంచం నీ స్వస్వరూపానికి ఏ మాత్రం వేరు కానట్టి "బ్రహ్మమే అయి ఉంది. "వేరు"గా కనబడడం స్వకల్పితమైన 'మాయ' వల్లనే. ఈ ఆత్మస్వరూపానికి సంబంధించిన 'ఎఱుక' అంతరంగంలా దృఢీకరణం పొందిన జ్ఞానికి – జన్మ మృత్యువులతో సహా వీటిలో ఏదీ విపరీతమైనదిగా కనిపించదు. ❖

('శ్రీవసిష్ఠ రామ సంవాదం' ఉత్పత్తి ప్రకరణం ఉత్తరార్థం నుంచి) **అనువాదం : వై. హెచ్. రామకృష్ణ**



కనుల పండువగా

కర్నూలు భక్త సమ్మేళనం

భక్తసమ్మేళనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్వామీజీలు, కార్యకర్తలు

స్వామీజీల వేదపఠనం

కర్నూలులో 2009 జనవరి 9,10,11 తేదీల్లో శ్రీరామకృష్ణ-వివేకానంద భావ ప్రచారపరిషత్ 18వ వార్షిక భక్త సమ్మేళనాన్ని 'కర్నూలు శ్రీరామకృష్ణ సేవాసమితి' అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ సమ్మేళనానికి రామకృష్ణ మఠం స్వామీజీలు, శారదా మఠం మాతాజీలు విచ్చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రెండువేల మంది భక్తులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. జనవరి 9వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు స్వామీజీల వేద పఠనంతో రామకృష్ణ మఠం, మిషన్‌ల సహాయక కార్యదర్శి స్వామి సువీరానందజీ జ్యోతి ప్రజ్వలనతో భక్త సమ్మేళనం ప్రారంభమయింది.

శ్రీరామకృష్ణ కథామృత గీతాలాపన

వక్తలు: అమరేశానందజీ, ఆత్మవిదానందజీ, సువీరానందజీ, జ్ఞానదానందజీ, శశికాంతానందజీ, అక్షరాత్మానందజీ, సుకృతానందజీ, శ్రీకాంతానంద

భవానీప్రాణ మాతాజీ, బోధమయప్రాణ మాతాజీ, త్యాగనిష్ఠప్రాణ మాతాజీ, డా॥ కమలా జయరావు, ఛాయామణి, పరాశరం శారద,

రోజూ ఉదయం 6 గంటలకు శ్రీరామకృష్ణ సుప్రభాతం, అష్టోత్తర శతనామ పూజ, రామకృష్ణ కథామృత పఠనం, కీర్తనలు, ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమయ్యేది.

స్వామీజీలు, మాతాజీలు, ఇతర వక్తలు తమ ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. భక్త బృందాల భజనలు, హరికథా గానం భక్తుల హృదయాల్ని రంజింపజేశాయి. విద్యార్థుల కూచిపూడి నృత్యం, భక్తి సంగీతం అందరినీ అలరించాయి. సాయంత్రం భగవాన్ శ్రీరామకృష్ణుల సంధ్యారతి-ఆరాత్రిక గానం అనూహ్య ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. యువత కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'యువజన సదస్సు'లో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని స్వామీజీల స్ఫూర్తిదాయక సందేశంతో ప్రేరణ పొందారు.

భక్తులు ఈ మూడు రోజులూ మూర్తిత్రయ స్మరణలో అలౌకిక ఆనందాన్ని అనుభవించారు. అనునిత్యం అదే ఆనందానుభూతులతో మన జీవనయాత్రను కొనసాగించేందుకు తగిన శక్తినీ, యుక్తినీ, భక్తినీ ప్రసాదించవలసిందిగా శ్రీగురుమహరాజ్‌ని ప్రార్థిద్దాం. ❖

నివేదిక : డా॥ శరత్‌చంద్ర

శ్రీరామకృష్ణులకు సాయం సంధ్యారతి, ఆరాత్రిక గానం

'శ్రీరామకృష్ణ లీలామృతం' పుస్తక ఆవిష్కరణ

నలో స్వామి జ్ఞానదానందజీ, భక్త బృందం

పి. నారాయణాచార్యుల హరికథాగానం, వివేకానంద స్టడీసర్కిల్ విద్యార్థినుల భక్తి సంగీతం

ందజీ, సుప్రియానందజీ, వినిశ్చలానందజీ, అచింత్యానందజీ, స్వసంవేద్యానందజీ, గుణేశానందజీ, ఈశప్రేమానందజీ, శితికంఠానందజీ, పరిజ్ఞేయానందజీ

డా॥ శరత్‌చంద్ర, డా॥పి. శ్యామసుందరమూర్తి, డి.వి. బ్రహ్మాజీ, డా॥ పి.వి. రెడ్డి, అమిరపు నటరాజన్

కుమారి టి. ప్రవల్లిక కూచిపూడి నృత్యం

అలౌకిక ఆనందానికి

వైరాగ్యం

– గౌతమ్

అన్నింటినీ వెంటాడుతుంది మృత్యువు; మృత్యువు నుంచి తప్పించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తారందరూ. కానీ విరాగి, మృత్యువును వెంబడిస్తాడు. శరీరం, బుద్ధి, మనస్సు అహంకారాల్ని మృత్యువు పాలు చెయ్యాలను కుంటాడు. విషసర్పం కాటు వల్ల కలిగే నొప్పి కన్నా మనోవ్యధ ఎక్కువ బాధాకరమైనదని గ్రహిస్తాడు. ఆ మనస్సును అంతం చేద్దామను కుంటాడు విరాగి. తల్లి, తండ్రి, అక్క, అన్న, చెల్లి ... ఇలా ప్రపంచంలోని బంధాలన్నింటినీ వివేకమనే ఆయుధంతో చీల్చి చెండాడతాడు. పంజరంలో నుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరే పక్షిలా విరాగి భవబంధాల నుంచి బయటపడతాడు.

సంపదలు, కీర్తి, అధికారం – ఇవన్నీ అలౌకికానందానికి అటంకాలని గ్రహించిన మహావైరాగ్య సంపన్నులు భగవాన్ బుద్ధ, భగవాన్ రమణ మహర్షి, భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

భగవాన్ బుద్ధ : సిద్ధార్థుడికి అన్నీ ఉన్నాయి... కాబోయే మహారాజు. సుగుణవతి శీలవతి సౌందర్యవతి అయిన భార్య, వంశాన్ని నిలబెట్టడానికి పుత్రుడు ఉన్నారు. అయినా కూడా వైరాగ్యంతో అన్నీ విడిచి అడవులకు వెళ్ళాడు. అతనికి మతి భ్రమించిందనీ, అందుకే రాజ్యాన్నీ, ధర్మపత్నినీ, పసివాడైన కుమారుణ్ణీ వదలి వెళ్ళాడనీ లోకం అంది. అందరూ పిచ్చివాడు అన్నటువంటి సిద్ధార్థుడు కాస్తా బుద్ధుడయ్యాడు. అతణ్ణి చూసిన లోకం ఆశ్చర్యంతో అతను సామాన్యుడు కాడనీ, అవతార పురుషుడనీ కీర్తించింది.

భగవాన్ రమణ మహర్షి : ఈ ''నేను'' ఎవరో తెలియకుండా, తెలుసుకోకుండా ఏది సాధించినా ఏం ప్రయోజనం! భార్య... పిల్లలు... ఈ సంసారం... ఇవన్నీ ఎందుకు! అజ్ఞానిగా సంసారంలో బ్రతకడం కన్నా చావడమే నయం” అనుకున్నాడు వేంకట రమణుడు. ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి అరుణాచలం (తిరువణ్ణామలై) చేరాడు. మహావిరాగి అయిన రమణుడు ధరించిన వస్త్రాలను త్యజించాడు. ఆలయంలోని పూజారుల ప్రార్థన మేరకు కౌపీనం ధరించాడు రమణుడు. అతని తల్లి వచ్చి, ఇంటికి రమ్మని బ్రతిమలాడి కంట తడిపెట్టుకుంది. గుండెలు బాదుకుంటూ తల్లి దుఃఖించినా ఆ బాల విరాగి స్పందించలేదు. కనీసం నోరు కూడా విప్పలేదు. చుట్టూ ఉన్న వాళ్ళు ఏదో ఒక జవాబు చెప్పమన్నారు. అప్పుడు ఆ బాలుడు ‘నీ తల రాత నీది, నా తల రాత నాది. దక్కేది వద్దన్నా దక్కుతుంది, దక్కనిది ఎంత ప్రయత్నించినా దక్కదు. కాబట్టి ఎవరి దారిన వారు మౌనంగా వెళ్ళడం మంచిది” అని వ్రాసి, మౌనంగా ఉండిపోయాడు. తల్లి మరేమీ చేయలేక వెనుదిరిగింది. ఆ బాలుడు రమణ మహర్షి అయ్యాడు. అతను అక్కడ నివాసం ఉండడం వల్ల అరుణాచల క్షేత్ర కీర్తి విశ్వవ్యాప్తమైంది.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస : వివాహం చేసుకున్నా, బ్రహ్మచర్యాన్ని పాటించిన మహావిరాగి శ్రీరామకృష్ణ పరమహంస. ఎప్పుడైనా ధనాన్ని తాకితే ఆయన చేతులు కొంకర్లు తిరిగేవి. వారు వెంటనే గంగాజలంతో చేతులు కడుక్కునేవారు. ధనాన్ని విషం కన్నా భయంకరమైనదిగా భావించేవారు. ఒకరోజు నరేంద్రుడు తన గురువును పరీక్షించడానికి వారు పడుకునే పరుపు కింద ఒక నాణాన్ని ఉంచాడు. శ్రీరామకృష్ణులు వచ్చి పరుపు మీద కూర్చోగానే, వారి శరీరానికి చెప్పలేని బాధ కలిగింది. వారి మనస్సులో అశాంతి కలిగింది. వెంటనే శిష్యులను పిలిచి పరపు, దిండు అన్నీ తీసి చూడమన్నారు. అలా వెతకగా రూపాయి నాణెం కనపడింది. అది తీసేసిన తరువాత ఆయన శాంతిగా పడుకున్నారు. ఇదంతా చూసి నరేంద్రుడు ఆశ్చర్యపోయాడు. కాలాంతరంలో స్వామి వివేకానంద (నరేంద్రనాథ్) అమెరికాలో ప్రసంగిస్తూ తన గురువు అయిన శ్రీరామకృష్ణులు వైరాగ్యంలో రారాజు అని కీర్తించారు.

అజ్ఞాన అస్త్రాలైన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అతని మీదకు దాడి చేస్తాయి. విరాగి నిరంతర సాధనలతో బ్రహ్మజ్ఞానాన్ని పొందుతాడు. ఆ బ్రహ్మజ్ఞాన ప్రకాశానికి అజ్ఞాన అస్త్రాలు మటుమాయమవుతాయి. విరాగి సర్వజ్ఞుడై బ్రహ్మానందంలో లీనమై, భగవంతుడితో సమానుడవుతాడు. ❖

అందరి పయనం.. ఆ ఉన్నత శిఖరాలకే...

– స్వామి సేవ్యానంద

"... నేను నిత్యం స్వామి వివేకానంద పుస్తకాలను చదివి, ఆచరించే ప్రయత్నం చేస్తున్నాను. వీటి ప్రభావంతో నా జీవితంలో ఆశావహ దృక్పథం ఏర్పడిందని నేను శ్రద్ధా, విశ్వాసాలతో చెప్పగలను – మన దేశంలోని యువతరమంతా స్వామీజీ పుస్తకాలను చదివి, ఆచరించే ప్రయత్నం చేస్తే తప్పకుండా మన దేశం పురోగతి చెందగలదు..."

రాజ్‌కోట్ రామకృష్ణ మఠానికి ఈ ఉత్తరం వ్రాసింది ఒక విద్యార్థి కాదు, ఉద్యోగమో, వ్యాపారమో చేసుకుంటున్న సజ్జనుడూ కాదు. జీవితంలో ఆవేశంతో తీసుకున్న తప్పుడు నిర్ణయానికి పశ్చాత్తాపపడుతున్న ఒక ఆశాజీవి. సమాజం దృష్టిలో కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఒక అపరాధి.

మనస్సుకు శిక్షణ బాల్యం నుంచే!

మనిషిలో చెడు స్వభావం, వినాశాత్మకమైన భావాలు రావడానికి కారణం ఏమిటి? వీటికి ముఖ్య కారణం మనస్సుకు సరైన శిక్షణ నివ్వకపోవడమే!

"మనస్సు తెల్లని బట్ట లాంటింది. దాన్ని ఏ రంగులో ముంచితే అది ఆ రంగు అవుతుంది" అని శ్రీరామకృష్ణులు చెబుతారు. మనస్సుకు మనం ఏ విధంగా శిక్షణనిస్తే ఆ విధంగానే తయారవుతుంది.

మనస్సు తెల్లని బట్టలా స్వచ్ఛంగా ఉండే పసితనంలోనే వారికి మంచి ఆలోచనలనూ, శక్తిమంతమైన ఆలోచనలనూ అందించి, శిక్షణను ఆరంభించడం తెలివైన పని. పరీక్షలనే ఉద్దేశంగా పెట్టుకొని, పిల్లలను ఒత్తిడికి గురి చేసే విద్యా విధానానికి స్వస్తి చెప్పి, మానవ ప్రతిభను (హ్యూమన్ ఎక్సెలెన్స్) వ్యక్తం చేయగలిగే విద్యావిధానానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిర్మలమైన మనస్సుతో పెరిగిన వీరు భవిష్యత్తులో వినాశాత్మకమైన భావాలకు దూరంగా ఉండి, నిర్మాణాత్మకంగా ఆలోచించగలరు.

ద్వేషానికి దూరంగా...

మనం సమాజంలో నలుగురితో కలిసి పనిచేసినప్పుడు అభిప్రాయభేదాలు రావడం సహజం. పూర్వం ఎవరితోనైనా మనఃస్పర్థలు వస్తే కొద్దిక్షణాలకే అంతా మరచి కలసిపోయేవారు. నేటి యువతరం ఆ విషయాన్ని పదే పదే ఆలోచిస్తూ, మనస్సులో ద్వేషభావం పెంచుకుంటున్నారు. అహంకారంతో పంతాలు, పట్టింపులకు పోయి, ఏదో విధంగా ప్రతిఘటించే ప్రయత్నం చేస్తున్నారు. చివరికి నేరస్థులుగా, అపరాధులుగా, దేశద్రోహులుగా మారుతున్నారు.

అనంతమైన శక్తికీ, దివ్యానందానికీ అధికారులమైన మనం ఇలాంటి చిన్న విషయాలకే చలించిపోవడం ఎంతవరకు సమంజసం? ద్వేషంతో కలుషితమైన మనస్సుకు ఉత్తమమైన భావాలను అందించి, మన మార్గాన్ని సన్మార్గం వైపు మలచుకోవాలి.

మన వంతు సహకారం:

ఒకరు చేసిన తప్పును పదే పదే గుర్తుచేసి, వారిని మరింత బలహీనులను చేసే కన్నా వారిలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తు చేసే ప్రయత్నం చేయవచ్చు కదా! అందరిలో ఆ దివ్యత్వమే ఉన్నప్పుడు ఎవరు చెడ్డవారు? ఎవరు అపరాధులు? అంతా అమృతానికి వారసులైన భగవంతుని సంతానమే కదా! మనకు తెలిసినా, తెలియకపోయినా అందరూ ఆ అమృతాన్ని ఆస్వాదించడానికే ప్రయత్నిస్తున్నారు.

డబ్బు కోసం మనిషి ప్రాణాల్ని తీయడానికి కూడా వెనుకాడని దోపిడీ దొంగ రత్నాకర్ కాస్తా వాల్మీకి మహర్షి కాలేదా? భోగవిలాసాలే సర్వస్వమని భావించిన స్త్రీలోలుడు 'వేమ బుద్ధారెడ్డి' కాస్తా యోగి వేమన కాలేదా? అందరి జీవితంలో ఆ మార్పు వచ్చే తీరుతుంది. ఈ రోజు కాకపోతే రేపు! ఈ జన్మలో కాకపోతే మరో జన్మలో! అందుకే ఎవరినీ చిన్న చూపు చూస్తూ, నిందించాల్సిన అవసరం లేదు. వీలైతే చేయూతనిచ్చి, వారు ఉన్న స్థితి నుంచి పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలి. మనమంతా భగవంతుని సంతానమే! మన అందరి పయనం ఆ ఉన్నత శిఖరాలకే!! ❖

యువవాణి

- స్వామి పరిజ్ఞేయానంద

మైత్రేయి, హైదరాబాద్.

ప్రశ్న: నేను ఉద్యోగం చేస్తున్నాను. అందువల్ల పిల్లల పెంపకం విషయంలో తగినంత శ్రద్ధ తీసుకోవడానికి సమయం ఉండడం లేదు. నేను సంపాదించకపోయినా మా ఆర్థిక పరిస్థితికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ వృత్తి మీద నాకున్న అభిమానం వల్ల ఉద్యోగం మానడానికి మనస్సు అంగీకరించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలా? లేక ఉద్యోగం చేయాలా? ఈ సందిగ్ధావస్థ నుంచి బయటపడే మార్గాన్ని చూపండి.

జవాబు: మనస్సు ఇలాంటి సందిగ్ధావస్థలో సతమతమవుతున్నప్పుడు మనం నిర్వర్తించవలసిన బాధ్యతల్లో దేనికి ప్రాధాన్యమివ్వాలో, తీసుకునే నిర్ణయం వల్ల కలిగే లాభనష్టాలు ఏమిటో ఒక జాబితాను తయారు చేసుకోవాలి. దాన్నిబట్టి మనకు ఏది ప్రయోజనకరవో ఆ మార్గాన్ని అనుసరించాలి.

మీకు ఉద్యోగం చేయాలనీ ఉంది, మీ పిల్లల బాగోగులకు తగినంత సమయాన్ని వినియోగించుకోలేక పోతున్నామనే బాధా ఉంది. చేస్తున్న వృత్తి మీద అపారమైన ఇష్టం ఉండడం వల్ల ఉద్యోగాన్ని వదులుకోవడానికి మీ మనస్సు అంగీకరించడం లేదు. అలాగే మీ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో అనే ఆందోళన మిమ్మల్ని వేధిస్తోంది.

ఉద్యోగం చేయకపోయినా మీకు ఎలాంటి ఆర్థికసమస్యా లేదు కాబట్టి మీ పిల్లల అభివృద్ధి కోసం మీ సమయాన్ని పూర్తిగా కేటాయించాలని మీరు మనఃస్ఫూర్తిగా అనుకుంటే, ఉద్యోగం చేయాలనే మీ ఇష్టాన్ని మీ పిల్లల శ్రేయస్సుకై త్యాగం చేయడం మంచిది.

The ideal of womanhood in India is motherhood - that marvellous, unselfish, all suffering, ever forgiving mother. *- Swami Vivekananda*

మాతృమూర్తి త్యాగానికి ప్రతిరూపం. అదే మన భారతీయ సంస్కృతి అన్న స్వామి వివేకానందుని వచనాలను ఒక్కసారి గుర్తు చేసుకోండి.

కుటుంబంతో సంతోషంగా జీవించడానికి అందరూ కోటీశ్వరులే కావాల్సిన అవసరం లేదు. జీవితం సాఫీగా సాగడానికి తగినంత ఆదాయం ఉంటే చాలు అన్న విషయాన్ని విస్మరించకండి.

Wealthy people are no happier than those of modest means.

జీవితంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సంపాదన తప్పనిసరి. కానీ ఉద్యోగాన్ని సరదా కోసం చేసేవారు మాత్రం పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో పూర్తి సమయాన్ని వినియోగించడం ముఖ్యం. తల్లి ఆలనాపాలనలో పెరిగే పిల్లలే ఉత్తమ పౌరులుగా తయారవుతారు. పిల్లలకు చిన్నప్పటి నుంచీ పెద్దలు నేర్పే సద్విషయాలే జీవితాంతం వరకూ వారి వెంటవుండి సంరక్షించే సహచరులు.

What the mother sings to the craddle goes all the way down to the coffin.

ఏ మహాత్ముని జీవిత చరిత్రను చూసినా వారి మహోన్నత వ్యక్తిత్వం వెనుకగల తల్లి పాత్ర అత్యంత ముఖ్యమైనదని మనకు అర్థమవుతుంది.

స్వామి వివేకానంద, అబ్రహామ్ లింకన్ తమ వ్యక్తిత్వాల్ని తీర్చిదిద్దిన తల్లి ప్రేమ, త్యాగాలను ఎంతగానో కొనియాడారు. మాతృమూర్తిని ఉద్దేశించి వారు పలికిన ఈ పలుకులే మాతృమూర్తి పట్ల వారికున్న అపారమైన గౌరవాభిమానాలకు నిదర్శనం.

If there is any being I love in the whole world, it is my mother. I am indebted to her for my intellectual development. *- Swami Vivekananda*

All that I am or hope to be, I owe to my angel mother - *Abraham Lincoln*

మీ పిల్లల్ని మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలంటే మీరు భువనేశ్వరీ దేవి (స్వామి వివేకానందుని తల్లి)నీ, నాన్సీ హ్యాంక్స్ (అబ్రహామ్ లింకన్ తల్లి)నీ ఆదర్శంగా తీసుకోండి. ❖

మీ సందేహాల్ని పంపాల్సిన చిరునామా :
యువవాణి
శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం,
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029

మనస్సును తాకిన 'సాహిత్య సర్వస్వం'

– రాచమడుగు శ్రీనివాసులు

నేను అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా సేవలందించాను. దాదాపు పాతికేళ్ళ క్రితం మా బంధువు ఒకాయన The Complete works of Swami Vivekananda - Volume- I తెచ్చి నాకు ఇచ్చాడు. ఆ పుస్తకం చదవడం ఆరంభించాను. అంతే! దాన్ని వదలకుండా చదవాలనిపించింది. ఎన్ని ఇబ్బందులున్నా, పనులున్నా తప్పకుండా ప్రతిరోజూ కొన్ని పేజీలైనా చదవకుండా నిద్ర పోయేవాణ్ణి కాదు. ఎన్నెన్నో అద్భుతమైన విషయాలను, చక్కటి భాషలో మనస్సుకు హత్తుకునేలా చెప్పాడు ఆ మహనీయుడు. రోజుకు దాదాపు 100 పేజీల చొప్పున ఎనిమిది సంపుటాలనూ పూర్తిగా చదివాను. తల్లితండ్రుల పట్ల, భార్యాపిల్లల పట్ల, సంఘం పట్ల ఎలాంటి దృక్పథం ఉండాలో తెలిసి వచ్చింది. ప్రతి హిందువు, ప్రతి భారతీయుడే కాదు ప్రతి మనిషీ చదవాల్సిన గ్రంథాలు అవి. కర్మ యోగం, భక్తి యోగం, రాజ యోగం, జ్ఞాన యోగం – అంటే ఏమిటో స్వామి వివేకానంద వివరించిన తీరు అమోఘం. గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అరవింద్ ఘోష్ లాంటి ప్రముఖులను ప్రభావితం చేసిన స్వామి వివేకానంద నా జీవిత దృక్పథాన్నే పూర్తిగా మార్చివేశారు. నా నుంచి ఏ ఒక్కరికైనా ఎంతో కొంత మంచి జరిగి ఉంటే దానికి కారణం స్వామి వివేకానందులే! మూఢ విశ్వాసాలు పోవాలన్నా, నిశిత ఆలోచన కలగాలన్నా, సంస్కృతీ సంప్రదాయాలు తెలియాలన్నా, ప్రేమ, సద్బుద్ధులు అలవడాలన్నా స్వామి వివేకానంద గ్రంథాలు చదవాల్సిందే! నేను గానీ, నా కుటుంబ సభ్యులు గానీ ఉన్నదాంతో తృప్తిపడి, హాయిగా, ఆనందంగా జీవిస్తున్నామంటే దానికి కారణం ముమ్మాటికీ స్వామి వివేకానందులే! ఎన్ని జన్మలెత్తినా ఆయన ఋణం తీర్చుకోలేనిది. ఆయన నుంచి నేను పొందిన లాభమే ప్రతి ఒక్కరూ పొందాలన్న తలంపుతో ఆయన నుంచి నేను తెలుసుకున్న విషయాలను ఇతరులకు చెప్పగల అవకాశాన్ని నేను ఎప్పుడూ సద్వినియోగం చేసుకుంటాను. ఏ ఊరికి వెళ్ళినా అక్కడ మొదట సందర్శించదగ్గ ప్రదేశం శ్రీరామకృష్ణ మఠమేనని అందరికీ చెబుతాను. "మీ వద్ద ఏ మాత్రం డబ్బు ఉన్నా శ్రీరామకృష్ణ మఠం ప్రచురించిన పుస్తకాలు కొనండి" అని మా విద్యార్థులందరికీ చెబుతుంటాను. హైదరాబాద్ వెళ్ళినప్పుడు నాతో పాటు ఉన్న బంధువులందరికీ శ్రీరామకృష్ణ మఠంలో కొంత సమయమైనా గడిపే అవకాశాన్ని కలిగించడమే నా ప్రథమ కర్తవ్యంగా భావిస్తాను. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద, శ్రీరామకృష్ణ పరమహంస గూర్చి తెలుసుకొని, వారి బోధనలను ఆచరించి, ధన్యజీవులు కావాలని ఆశిస్తున్నాను. ❖

(రాచమడుగు శ్రీనివాసులు, అనంతపురం)

With Best Compliments From

PENNAR INDUSTRIES LIMITED

305, Saptagiri Towers, Begumpet, Hyderabad - 500 016

పెన్నార్ కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

మీ పురోగతిని ఆపుతున్నదెవరు?

ఒక కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులందరూ ఒకరోజు పనికి వచ్చేసరికి, పెద్ద అక్షరాలతో వ్రాసిన నోటీసు కనిపించింది.

"ఈ కంపెనీలో మీ పురోగతిని ఆపుతున్న వ్యక్తి చనిపోయాడు. శవాన్ని కంపెనీ వ్యాయామశాలలో ఉంచాం. చివరిచూపుగా వచ్చి చూడవచ్చు."

అది చదివిన వారికి సహోద్యోగి మరణించాడనగానే మనస్సు చివుక్కుమంది. కానీ తమ పురోగతి ఆపే ఈ ఉద్యోగి ఎవరబ్బా అని ఆశ్చర్యపోయారు. కుతూహలంతో అందరూ వెంటనే వ్యాయామశాలకు బయలుదేరారు. మొత్తం అందరూ ఒకేసారి అక్కడకు చేరేసరికి పరిస్థితి ఉద్వేగపూరితంగా మారింది. వారి తోపులాటను అదుపు చేయడానికి భద్రతా సిబ్బందిని పిలవవలసి వచ్చింది.

శవపేటిక దగ్గరకు చేరుతున్న కొద్దీ ప్రతి ఉద్యోగికీ ఉద్వేగం పెరిగిపోతోంది. అయినా, "నా పురోగతిని ఆపుతున్న ఈ శత్రువు మరణించాడు. అదే చాలు!" అనుకోసాగారు. కానీ శవపేటికలోకి తొంగిచూశాక మాత్రం సంభ్రమాశ్చర్యాలతో నోరు మెదపలేక పోయారు. వారి హృదయాంతరాళాల్ని ఎవరో తాకినట్లు మౌనంగా అలాగే నిలబడిపోయారు.

నిజానికి శవపేటికలో ఉన్నది ఒక అద్దం. అందువల్ల చూసిన ప్రతివారికీ తమ ప్రతిబింబమే కనిపించింది. శవపేటిక ప్రక్కన మరొక నోటీసు వారికి కనిపించింది. "మీ పురోగతిని ఆపగల శక్తి కేవలం ఒక్క వ్యక్తికే ఉంది. అది **మీరే!**"

Men in general lay all the blame of life on their fellowmen, or, failing that, on God, or they conjure up a ghost, and say it is fate... We are responsible for what we are, and whatever we wish ourselves to be, we have the power to make ourselves. ***- Swami Vivekananda***

మీ జీవితంలో విప్లవాత్మకమైన మార్పులు తేగలవారు మీరే! మీ సుఖసంతోషాలను ప్రభావితం చేసి, మీ కలలను సాకారం చేసి, విజయాన్ని ఇవ్వగలిగేదీ మీరే! మీకు నిజంగా సహాయం చేయగలిగేదీ మీరే!

మీ పైఅధికారులు, స్నేహితులు, తల్లితండ్రులు, సహోద్యోగులు – వీరందరినీ మార్చివేసినా, మీ జీవితం మాత్రం మారదు, బాగుపడదు. మీరు మారినప్పుడే మీ జీవితం మారుతుంది. మీ అపనమ్మకాలను అధిగమించి, మీ జీవితానికి మీరే బాధ్యులన్న అవగాహనకు వచ్చినప్పుడే అది మరింత మెరుగవుతుంది.

అన్ని సంబంధ బాంధవ్యాలలోకీ ముఖ్యమైనది – "మీకు మీతోనే ఉండే సంబంధం!" మిమ్మల్ని మీరు గమనించుకోండి. లోతుగా పరీక్షించుకోండి. కష్టనష్టాలనూ, అసాధ్యమైన విషయాలనూ చూసి భయపడవద్దు. విజేతలుగా అవతరించండి. మీ వ్యక్తిత్వాన్ని మీరే నిర్మించుకోండి. మీ జీవితాన్ని మీరే మలచుకోండి. ❖

– స్వామి అక్షరాత్మానంద

అనువాదం : అమిరపు నటరాజన్

మహనీయుల జీవితాల్లో

మధురఘట్టాలు

- ఆర్. కృష్ణ

కరుణామూర్తికి కనువిప్పు !

అది ఎండాకాలం. బోధి వృక్షం క్రింద కూర్చొని సిద్ధార్థుడు తపస్సు చేస్తున్నాడు. యథాప్రకారం ఆయన ఆ మధ్యాహ్న వేళ సమీపాన ఉన్న కొలను దగ్గరకు వెళ్ళి స్నానం చేశాడు. కొలనులో అక్కడక్కడ తామర పూవులున్నాయి. వాటి అందానికి ఆకర్షితుడై సిద్ధార్థుడు ఒక కమలాన్ని తుంచాడు. ఆయన కమలాన్ని తుంచిన వెంటనే ఆకాశవాణి వినపడింది: "సిద్ధార్థా! ఆ పువ్వు ఏం తప్పు చేసింది? మొక్క నుంచి పువ్వును వేరు చేసి, దాని ప్రాణాన్ని తీసే హక్కు నీకెక్కడిది?" సిద్ధార్థుడు మారుమాట్లాడక కమలాన్ని నీటిలో వదలి తాను చేసిన పొరపాటుకు చింతిస్తూ కొలనుగట్టుకి చేరాడు.

ఇంతలో ఒక వేటగాడు ఆ కొలను దగ్గరకు వచ్చి, నీరు త్రాగి, అందులో ఉన్న తామర మొక్కలు ఈతకు ఆటంకమనుకున్నాడు కాబోలు కొన్ని మొక్కలను వేళ్ళతో సహా పెకిలించి, గట్టు పైన పారవేసి తన దారిన తాను వెళ్ళాడు. ఇది గమనించిన సిద్ధార్థుడు, "ఓ ఆకాశవాణీ! నేను ఒక్క పద్మం తెంపినందుకు నన్ను తప్పుబట్టావు. ఆ వేటగాడు ఎన్నో పద్మాలను వేళ్ళతో సహా పెరికి బయట పడవేశాడు. అతణ్ణి నీవు అస్సలు మందలించనే లేదు. నాకొక న్యాయం, అతనికొక న్యాయమా? చేసిన తప్పు ఒక్కటే అయినప్పుడు అందరికీ ఒకే న్యాయం ఉండాలి గదా?" అని అన్నాడు.

అప్పుడు ఆకాశవాణి, సిద్ధార్థుడితో, "నీవు జ్ఞానివి. వాడొక మూర్ఖుడు. గొప్పవారు చేసే పనులను సామాన్యులు ఆదర్శంగా తీసుకొంటారు. ఒక పామరుడు తెలియక చేసిన తెలివి తక్కువ పనులను పాటించరు, పట్టించుకోరు. మీ లాంటి తాపసులు మీ శ్రేయస్సు కొరకు, లోకకల్యాణం కొరకు తప్పుడు ఆలోచనలు చేయరాదు. తప్పుడు మాటలు మాట్లాడరాదు. తప్పుడు పనులు చేయరాదు. ప్రతి విషయంలోనూ మీరు ఆదర్శప్రాయంగా నడుచుకోవాలి" అంది. సిద్ధార్థునికి కనువిప్పు కలిగింది. ఇలాంటి పొరపాటు మరొకసారి చేయరాదని దృఢంగా నిశ్చయించుకున్నాడు. ❖



దేశ శ్రేయస్సుకే ప్రాధాన్యత!

ఒక పర్యాయం అమెరికా రాష్ట్రపతి అబ్రహామ్ లింకన్ తనకు బద్ధ విరోధి అయిన ఒక వ్యక్తిని రక్షణ మంత్రిగా నియమించాడు. అతడు లింకన్‌ను నిశితంగా విమర్శిస్తుండే వాడు.

ఒక రోజున లింకన్ వద్దకు కొందరు శ్రేయోభిలాషులు, మిత్రులు వచ్చి లింకన్‌తో "మిమ్మల్ని విమర్శించే వ్యక్తిని రక్షణమంత్రిగా ఎందుకు నియమించారు?" అని అడిగారు. అందుకు లింకన్ వారితో "అతడు యోగ్యమైన వ్యవస్థాపకుడు, సంస్థాపకుడు, సంచాలకుడు, తన క్షేత్రంలో నేర్పుగల కార్యకర్త. అతడు నన్ను అవమానించవచ్చు గాక. కానీ అతని గుణగణాలు, అతని యోగ్యత దేశ శ్రేయస్సుకు ఉపయోగపడతాయి. వ్యక్తిగత ద్వేషం కారణంగా దేశకార్యం కొరకు పనికి వచ్చే ఒక కార్యకుశలుడైన వ్యక్తిని నేను పోగొట్టుకోలేను. అతనికి దూరంగా ఉండలేను. నాకు కావలసింది లింకన్ భక్తులు కాదు, దేశభక్తులు. అతడు స్వచ్ఛమైన దేశభక్తుడని నా దృఢవిశ్వాసం."

నిజమైన దేశభక్తుని ఈ మాటలు విని మిత్రులు ఇక ఏమీ జవాబు చెప్పలేక పోయారు. ❖

ఊహలకు కళ్ళెం వేద్దాం!

మనస్సును స్వాధీనం చేసుకోవడంలో ఎదురయ్యే కష్టాలు ఊహల వల్లనే! సర్వసాధారణంగా మనం ఊహల గాలిపటాలు ఎగురవెయ్యడంలోనూ, పగటికలలు కనడంలోనూ మునిగి తేలుతూ ఉంటాం. అర్థం లేని వెర్రి మొర్రి ఊహాగానాలు రకరకాలుగా చేస్తూ ఉంటాం. మన ఎదురుచూపులు ఊహించుకున్నవే కావచ్చు, నిరాధారమైనవే కావచ్చు. కానీ అవి మన హృదయంలో నిజమైన బాధలను రగిలిస్తాయి. మన భయాలు నిరాధారమైనవే కావచ్చు. కానీ మన మనస్సులో నిజమైన క్షోభను తీసుకొస్తాయి. మన ఊహాశక్తిని తప్పుగా ఉపయోగించి, లేనివాటిని ఉన్నవిగా చూస్తాం. ఎలాంటి ఆధారమూ లేని చింతలతో బాధపడతాం. ఈ అలవాటు ఎక్కువయ్యే కొద్దీ మనస్సును స్వాధీనం చేసుకోవడం దుర్లభమైపోతుంది. రోజులో ఎక్కువ భాగం కలల ప్రపంచంలోనే బ్రతుకుతున్నామనీ, నిజాల ప్రపంచంలో కన్నా నీడల ప్రపంచంలోనే కాలం గడుపుతున్నామనీ తెలుసుకోలేని స్థితిలో ఉంటాం.

ఈ అలవాటును వదిలించుకుంటే తప్ప మనస్సును స్వాధీనం చేసుకోవడం కుదరదు. మరి ఈ పని ఎలా చెయ్యాలి? ఈ క్రింది కథ మనకు ఒక మంచి సూచనను అందిస్తుంది.

ఒక పెద్దమనిషి నడిచివెళుతున్నాడు. కొద్దిగా తాగిన మైకంలో ఉన్నాడు. ఆయన చేతిలో ఒక పెట్టె ఉంది. దాని మూత మీద, నాలుగు ప్రక్కలా చిన్న చిన్న చిల్లులు ఉన్నాయి. ఆ పెట్టెలో ఏదో జంతువును అతడు తీసుకుపోతున్నట్లుగా చూపరులకు తోస్తోంది. దారినపోయే పరిచయస్థుడు అతణ్ణి ఆపి, 'ఈ పెట్టెలో ఏముంది?' అని అడిగాడు.

'ముంగిస' అని ఆ మైకంలో ఉన్న పెద్దమనిషి సమాధానం చెప్పాడు. 'ముంగీసా? అది ఎందుకండీ?' అని ఆ పరిచయస్థుడు అడిగాడు.

'నా సంగతి నీకు తెలుసు కదా! ఇంకా నేను బాగా తాగలేదు గానీ, ఇప్పుడు పోయి తాగుతాను కదా? అప్పుడు నాకు చుట్టూ పాములు కనబడతాయి. నాకు పాములంటే మహా భయం. అందుకనే ఈ ముంగిసను తీసుకుపోతున్నాను. ఇదయితే నన్ను పాముల నుంచి కాపాడుతుంది!'

'అబ్బా! ఆ పాములు నిజమైనవి కావు గదయ్యా!' అని ఆ పరిచయస్థుడు అన్నాడు.

'ఔను నిజమే! ఈ ముంగిస కూడ నిజమైనది కాదు!' అని ఆ పెద్దమనిషి సమాధానమిచ్చాడు.

నిజానికి ఆ పెట్టెలో ఏమీ లేదు!

అదే విధంగా ఒక ఊహను ఎదుర్కోవడానికి వేరొక ఊహ కావాలి. తప్పుడు ఊహలను తరిమికొట్టడానికి సరైన ఊహల సహాయం మనకు అవసరం. స్వామి వివేకానంద ఇలా బోధించారు: "ఊహాశక్తిని సరిగ్గా వినియోగించుకుంటే అది మనకు గొప్ప స్నేహితుడు కాగలదు. అది మనల్ని తర్కాన్ని కూడా దాటించి తీసుకుపోతుంది. మనల్ని ఎక్కడికైనా చేర్చగలిగిన ఒకే ఒక్క వెలుగు - ఊహాశక్తి మాత్రమే." భగవంతుని గురించిన ఆలోచనలు, ఊహలు మాత్రమే అతి పవిత్రమైనవి. దేవుని ఆలోచనలను ఎంత ఎక్కువగా చేస్తే మన మనస్సు కలిగించే కష్టాలు అంతగా తగ్గిపోతాయి. ❖

ఆత్మ విశ్వాసం

– డా॥ కరిమద్దెల నరసింహారెడ్డి

ఆత్మవిశ్వాసమంటే మన మీద మనకు నమ్మకం ఉండడమని అర్థం. ఆత్మ విశ్వాసం అనేది కష్టమైన సమస్యలను సైతం సులభంగా పరిష్కరించుకోవడానికి కొండంత అండగా నిలుస్తుంది. మనిషి జీవించడానికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎంత అవసరమో, ఆత్మ విశ్వాసం కూడా అంతే అవసరం. ఏది లేకున్నా ఆత్మ విశ్వాసం గుండెల నిండుగా ఉన్నవాడు ప్రగతిపథంలో ముందుకు, మునుముందుకు నడుస్తూ జీవితాన్ని విజయవంతం చేసుకుంటాడు. అపూర్వమైన విజయాలను సాధిస్తాడు.

...People say, 'Have faith in this fellow or that fellow', but I say, 'Have faith in yourself first', that's the way. Have faith in yourself - all power is in you - be conscious and bring it out. *- Swami Vivekananda*

ఆత్మవిశ్వాసంతో చంద్రలోకాన్ని ఆక్రమించవచ్చు. ఇంద్రలోకాన్ని జయించవచ్చు. మహిమాలయమైన హిమాలయాన్ని అధిరోహించవచ్చు. సప్తసముద్రాలను అలవోకగా ఈదవచ్చు. విశాల ప్రపంచాన్ని అరచేతిలో చూపించవచ్చు. ప్రళయాగ్నులను గుప్పిట పట్టవచ్చు. ఉద్గ్రంధాలు, సద్గ్రంథాలు వ్రాయవచ్చు. గగనానికి నిచ్చెన వేయవచ్చు. నీలాల నింగిలో జలధారల పరదాలలో దాగుడు మూతలాడవచ్చు. చావు పుట్టుకల రహస్యాన్ని తెలుసుకోవచ్చు.

ఆత్మ విశ్వాసం విజయలక్ష్మిని వరించడానికి ఆటపట్టు, ఆయువుపట్టు. తప్పటడుగులు వేస్తూ, పడుతూ లేస్తూ నడక నేర్చుకునే పాలబుగ్గల పసిపాప మొదలుకొని ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిన టెన్సింగ్ నార్కే వరకు ఆత్మవిశ్వాసంతోనే ఆటంకాల కంటకాలను అధిగమించి విజేతలయ్యారు.

నువ్వుల్లో నూనె దాగి ఉన్నట్లు, చెకుముకిరాయిలో నిప్పురవ్వలున్నట్లు, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీలో మహాత్ముడు దాగి ఉన్నట్లు, నరేంద్రునిలో వివేకానందుడు దాగి ఉన్నట్లు, సిద్ధార్థునిలో బుద్ధుడు దాగి ఉన్నట్లు, గదాధరునిలో పరమహంస దాగి ఉన్నట్లు – ప్రతివ్యక్తిలోనూ ఆత్మవిశ్వాసమనే శక్తి దాగి ఉంటుంది.

భారతీయ ఆధ్యాత్మిక పతాకాన్ని విశ్వవిహాయసంలో రెపరెపలాడించిన స్వామి వివేకానందుడు "ఆత్మవిశ్వాసం గల కొందరు వ్యక్తుల పవిత్ర చరిత్రే ప్రపంచ చరిత్ర" అని చాటి చెప్పారు. ఆత్మవిశ్వాసం మనలో అంతర్గతంగా ఉన్న దివ్యశక్తిని వెలికి తీస్తుంది.

"ధనము బలము కన్న దైవబలము కన్న
గుండె బలము కన్న కండ కన్న
అసలు మనిషి బలము ఆత్మవిశ్వాసమే!"

ఓ యువతా! మేలుకో! ఆత్మ విశ్వాసాన్ని మేలుకొలుపుకో! ❖

Statement about ownership and other particulars about **Sri Ramakrishna Prabha** (according to Form IV Rule 8, circulated by Registrar of Newspapers for India).

1.	Place of Publication	:	Hyderabad - 500 029
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda Hyderabad-500 029
4.	Publisher's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda Hyderabad-500 029
5.	Editor's Name	:	Swami Parijneyananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda Hyderabad-500029
6.	Name & Address of the individuals who own the news or shareholder holding more than1% of the capital	:	Ramakrishna Math Domalguda Hyderabad-500029

I , Swami Jnanadananda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd.
Swami Jnanadananda
Signature of the Publisher

Date: 01.03.2009

పరిపూర్ణతనిచ్చే 'విద్య'

- స్వామి గుణేశానంద

విద్య అంటే మనసుని కేవలం సమాచారంతో నింపడం మాత్రమే కాదు. మనసుపై సాధికారతను, నియంత్రణను సమకూర్చేదే నిజమైన విద్య. స్వామి వివేకానంద "మానవునిలో ఉన్న పరిపూర్ణతని ప్రకటించడమే విద్య" అన్నారు. అంటే మనం మన జీవితాల్లోని పరిపూర్ణతని వెలికితీయాలి. నేటి విద్యాభ్యాసం వల్ల మనం విద్యని సమగ్రంగా కాక విద్యలోని ఒక పార్శ్వాన్ని మాత్రమే పొందగలుగుతున్నాం. విద్యలో 1. పరిశీలన 2. వివేకం 3. పట్టుదల అనే మూడు అంశాలున్నాయి.

పరిశీలన: చాలామంది ఒక సందర్భాన్ని గాని, ఒక విషయాన్ని గాని సరిగ్గా అంచనా వేయలేరు. ఒక విషయాన్ని గాని, ఒక సన్నివేశాన్ని గాని ఉన్నదున్నట్లుగా పరిశీలించినపుడు అనేక సమస్యలకు మనం దూరం కావచ్చు, మనుష్యులను జాగ్రత్తగా పరిశీలిస్తే వారు ఎటువంటివారో మనం అర్థం చేసుకోగలుగుతాం. కాబట్టి 'పరిశీలన' అన్నది మన జీవితంలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

వివేకం : ఏ పని చెయ్యవచ్చో, ఏ పని చేయకూడదో అనేది వివేకం వల్ల తెలుస్తుంది. మనచుట్టూ ఉన్న విషయాలను గమనించి, పనికిరాని విషయాలను విస్మరించి, అర్థవంతమైన విషయాలను స్వీకరించి మన జీవితాలకి అన్వయించుకోవాలి. కొన్ని ప్రాంతాలలో ప్రవేశద్వారం దగ్గరుండే ఆగు, గమనించు, వేచిఉండు, పొమ్ము అనే హెచ్చరిక బోర్డు ఒక మంచి ఉదాహరణ.

ఎన్ని పనుల్లో ఉన్నా మనం ఆగి, ఆ హెచ్చరికను జాగ్రత్తగా గమనించాలి. అప్పుడు విచక్షణనుపయోగించి ముందుకెళ్ళాలా వద్దా అన్నది నిర్ణయించుకోవాలి. దానినే వివేకం అంటారు.

పట్టుదల: ఒక పనిని చేపట్టినప్పుడు ఆ పని పూర్తయ్యేవరకూ మన శక్తి-యుక్తులన్నీ ఆ పనిమీదే కేంద్రీకరించాలి. గమ్యాన్ని నిర్ణయించుకున్నాక దానిని చేరేవరకూ మన సర్వయత్నాలనూ బలోపేతం చేయాలి. మన దృష్టినంతా ఆ విషయంపైనే ఏకాగ్రం చేయాలి. ఒకవేళ విఫలమైతే, మన దృష్టిని ఆ విషయంపైన సరిగ్గా కేంద్రీకరించామా లేదా అని విశ్లేషణ చేసుకోవాలి. మనం పయనించే మార్గాన్ని బాగా స్థిరపరచుకుంటే గమ్యమే మనదగ్గరకు వస్తుంది.

గతం వర్తమానాన్ని రూపొందిస్తే, వర్తమానం భవిష్యత్తు అవుతుంది. రూపాంతరం చెందిన వర్తమానమే భవిష్యత్తు అనీ, వర్తమానమే భవిష్యత్తుకి పునాది అనీ గ్రహించక ఎప్పుడూ భవిష్యత్తులోనే బ్రతుకుతూ ఉంటాము. కనుక వర్తమానంలోనే బ్రతుకుతూ పూర్ణత్వాన్ని పొందడానికి పై గుణాలను అలవరచు కొందాం.

ఎందుకు చదవాలి? చాలామంది విద్యార్థులు ఎందుకు చదువుకుంటున్నారని ప్రశ్నిస్తే, ధన సంపాదనకని కొందరు, సమాజంలో గౌరవాన్ని పొందడానికని మరి కొందరు, పేరు ప్రఖ్యాతుల కోసమని ఇంకొందరూ జవాబిస్తారు. వాటి కోసమే చదువుకుంటామా! విద్య యొక్క ప్రధాన లక్ష్యం జ్ఞాన సముపార్జన. ఆ జ్ఞానాన్ని సమాజాభివృద్ధికై వినియోగించాలి. పేరు ప్రఖ్యాతులు, సిరి సంపదలు వాటంతట అవే వస్తాయి. విద్య మనకు సౌశీల్యాన్ని కలుగజేస్తుంది. ఉన్నత విజ్ఞానాన్ని పొందాలని దృఢంగా నిర్ణయించుకుంటే సర్వ మానవుల పట్ల ప్రేమ, సత్యసంధత, ధైర్యస్థైర్యాలు కూడా అలవడతాయి. తద్వారా ఆత్మ వికాసం కలుగుతుంది. మన జీవితాల్ని

తపస్సు, స్వాధ్యాయనాల సంగమంగా చేసుకుంటే స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిమర్శ అలవడతాయి.

ఒత్తిడిని ఎందుకు పొందుతున్నాం : స్నేహితులారా! మీరెందుకు విలపిస్తారు. మీలోనే అనంతమైన శక్తి ఉంది. మీలోని శక్తినంతా ప్రోగుచేసుకోండి. ఈ విశ్వమంతా మీ పాదాక్రాంతమవుతుంది. మీలోని ఆత్మవిశ్వాసమే మిమ్మల్ని విజయతీరాలకు నడిపిస్తుంది. అనంతమైన శక్తి మీలోనే ఉంది. మనం గొర్రెలం కాము. సింహాలమని గుర్తుపెట్టుకోండి. మనం విశ్వాన్ని శాసించడానికి వచ్చాం. కాని విశ్వంచేత శాసింపబడడానికి కాదు. గొప్ప వారైన వారందరూ ఇలా కష్టనష్టాలను అధిగమించినవారే. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఇతరుల్ని నిందించకూడదు. మన వైఫల్యాలకి ఇతరులను నిందిస్తూ కూర్చోరాదు. మనలోనే మార్పును తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి. దీనికి ఉదాహరణ మన నిజ జీవితంలోనే చూడవచ్చు. వర్షం పడుతున్నప్పుడు వర్షాన్ని తిట్టుకుంటూ కూర్చోక, వర్షం నుంచి తప్పించుకోవడానికి ఒక గొడుగును వాడతాం. అలాగే పరిస్థితులు అనుకూలించనప్పుడు మనలోనే కావలసిన మార్పులు చేసుకుంటూ పరిస్థితులను, మనుష్యులను నిందించక ముందుకు పయనించాలి. పరిస్థితులకు అనుగుణంగా మారేవాడు విజ్ఞుడు. విపత్కర పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవాలి. పై విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుంటే ఒత్తిడిని విజయవంతంగా ఎదుర్కోగలం.

అపజయాలను జయించడం ఎలా? ఒక విద్యార్థి పరీక్షలో కృతార్థుడు కాకపోతే ముందుగా ఉపాధ్యాయులను నిందిస్తాడు. ఉపాధ్యాయులు సరిగా బోధించలేదనీ, ప్రశ్నలు చాలా కష్టంగా ఉన్నాయనీ అంటూ కారణాలు చెబుతాడు. "నేను బాగా చదవలేదు"అని మాత్రం ఏ విద్యార్థీ చెప్పడు. "మనకు మనమే మిత్రులం-మనకు మనమే శత్రువులం" అన్న విషయం గుర్తుపెట్టుకోండి. బాధ్యతలను మీ భుజస్కందాలపై వేసుకోండి. "నేనున్న పరిస్థితులకు నేనే బాధ్యుడను"అని అనుకోవాలి. మన వైఫల్యాలను ఇతరుల మీద రుద్దకూడదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "మానసిక బలహీనతను వదిలి కార్యనిర్వహణలో ముందుకుసాగు'' అంటాడు. మనం మానసికంగా బలహీనమయినప్పుడు మాత్రమే మనం కలత చెందుతాం. మనచుట్టూ ఎంత విషాదం, బాధ ఉన్నా అవి మనల్ని సమీపించ సాహసించలేవు. మన బుద్ధి స్థిరంగా, నిశ్చలంగా ఉన్నప్పుడు బలహీనతలు దరిచేరవు. ఎవరైనా మనల్ని బాధ పెట్టినా, మనం పట్టించుకోనట్లయితే, మనకు ఏమీ భయం లేదు. బాధకు లొంగితే కష్టాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. కష్టాలను అంగీకరించక, అధిగమించడానికి కృషిచేయాలి. మీ అపజయాన్ని గానీ, మీ తప్పులను గానీ మీ పరాజయాలుగా భావింపక, వాటిని ఒక గుణపాఠంగా మలచుకొని, విజయాన్ని సాధించండి.

పరాజయాలే విజయానికి సోపానాలు. క్రీడాకారుడు పెద్ద పెద్ద అంగలు వేయాలనుకున్నప్పుడు, కొన్ని అడుగులు వెనుకకు వేసి అప్పుడు ముందుకు సాగుతాడు. అలాగే అపజయం ఎదురైనపుడు నిరాశతో క్రుంగిపోకుండా సానుకూల దృక్పథంతో ఉన్నట్లయితే, క్రింద పడడం అనేది పైకిలేవడానికే అనే అవగాహన వస్తుంది. అప్పుడు విజయమెంతో దూరం ఉండదు.

పరిశీలనాశక్తి, వివేకం, పట్టుదల - ఈ మూడు లక్షణాలని పెంపొందించేదే 'పరిపూర్ణ విద్య'. అలాంటి విద్య నేడు అత్యంత అవసరం. ❖

అనువాదం: శ్రీమతి కమల కుమారి.

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ పి.ఎ. నాగరాజు, హిందుపూర్, అనంతపురం జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గోపిదిన్నె, తంబళ్ళపల్లి, చిత్తూరు జిల్లా
శ్రీ వై.వి. రమణప్ప, విజయనగర్ కాలనీ కంటోన్మెంట్, బళ్ళారి, కర్నాటక	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గుండ్రంపల్లి,చిట్యాల, నల్లగొండ జిల్లా
" " "	శ్రీ సర్వజన మనోరంజన తెలుగు లైబ్రరి,గారులియ, పారగనాస్,పశ్చిమబెంగాల్
" " "	ఎమ్.పి.పి. పాఠశాల, వంకదోత్ తాండ, పొన్నంపల్లి, ఖమ్మం జిల్లా
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్, నేరెడిగొండ, ఆదిలాబాద్ జిల్లా
శ్రీ గాదిరాజు గోపాల కృష్ణంరాజు, బలుసుముడి, భీమవరం, ప.గో.జిల్లా	ఎమ్.పి.పి. పాఠశాల, మహదేవపట్నం, ప.గో.జిల్లా - **534 109**
శ్రీ సి. గోపాల రెడ్డి, సుజాతమ్మ కాలనీ, దర్గామిట్ట, నెల్లూరు- ***524 003***	వి. ఆర్. ఉన్నత పాఠశాల, నెల్లూరు - **524 002**
" " "	జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గూడూరు, నెల్లూరు జిల్లా - **524 101**
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మనుబోలు, నెల్లూరు జిల్లా - **524 405**
శ్రీ ఎస్. జయంత్ రావు, లాలా చెరువు, రాజమండ్రి - ***533 106***	సి.వి. రామన్ పబ్లిక్ స్కూల్, హుస్నాబాద్, కరీంనగర్ జిల్లా -**505 467**
" " "	సరస్వతీ శిశుమందిర్, పండి, కుబీర్, ఆదిలాబాద్ జిల్లా - **504 329**
" " "	ఆం.ప్ర. గురుకుల పాఠశాల, సర్వేల్, సంస్థాన్ నారాయణపురం, నల్లగొండ జిల్లా
శ్రీ అమిలినేని కృష్ణయ్య	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాకెట్ల, ఉరవకొండ, అనంతపురం జిల్లా
శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీ ప్రశాంతా ఉన్నత పాఠశాల, దర్శి, ప్రకాశం-**523 247**	ఎమ్.పి.యు.పి. పాఠశాల, బ్రహ్మేశ్వరం, యెరుకుల్ల, దత్తలూరు, నెల్లూరు జిల్లా
సి. వి. చక్రపాణి, దోమల్‌గూడ, హైదరాబాద్ - **500 029**	శ్రీ సరస్వతీ శిశుమందిర్, చెన్నూరు, ఆదిలాబాద్ జిల్లా - **504 201**
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిప్రి, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ జిల్లా
" " "	ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల,జటర్ల,బజార్‌హత్నూర్,ఆదిలాబాద్‌జిల్లా
శ్రీ కొత్తపల్లి కోటేశ్వరరావు, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్	పంచాయత్ లైబ్రరీ, మోదుకూరు, టి. సుందుర్, కృష్ణా జిల్లా
శ్రీ లక్ష్మణ స్వామి, గాజువాక, విశాఖపట్నం - ***530 006***	శ్రీ రామాలయ అభివృద్ధి సేవా సంఘం, దిమిలి, విశాఖపట్నం జిల్లా
శ్రీమతి కె. సుశీల, కర్మన్‌ఘాట్ క్రాస్ రోడ్స్, హైదరాబాద్	జ్ఞానోదయ పబ్లిక్‌స్కూల్, నాగారం రోడ్, హుస్నాబాద్, కరీంనగర్ జిల్లా
శ్రీ బి. మనోహర్, బొల్లారమ్ బజార్, సికింద్రాబాద్	నృపతుంగా ఉన్నత పాఠశాల, బాగ్ లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్
" " "	వృద్ధాశ్రమం, స్టేట్ పెన్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కుంట్లూరు, రంగారెడ్డి జిల్లా
శ్రీమతి & శ్రీ కె.కె. దాస్ & ఫ్యామిలీ, అశోక్‌నగర్, హైదరాబాద్	న్యూ నాగార్జునా ఉన్నత పాఠశాల, వికారాబాద్, రంగారెడ్డి జిల్లా - **501 101**
" " "	*ధర్మవిద్యాలయ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీనగర్ కాలనీ, వికారాబాద్*
శ్రీమతి ఎస్.ఎస్. కూరెళ్ళ, జెర్సీవిల్లే, ఇల్లనాయిస్, యు.ఎస్.ఎ.,	*శ్రీ సరస్వతీ శిశుమందిర్, పి.జి. సెంటర్, గోదావరి ఖని- **505 289***
" " "	*శ్రీ సరస్వతీ శిశుమందిర్, కేశవనగర్, గోదావరి ఖని - **505 211***
డాక్టర్ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా - ***505 301***	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనుసముద్రం పేట, నెల్లూరు జిల్లా
శ్రీ జయలక్ష్మిరాజు, జూబ్లీహిల్స్, హైదరాబాద్	శ్రీ సరస్వతీ శిశుమందిర్, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా - **505 325**
శ్రీమతి పి. శోభ, జెమినీ కాలనీ, జమిస్థాన్‌పూర్, ముషీరాబాద్, హైదరాబాద్	శ్రీ సరస్వతీ శిశుమందిర్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా - **504 208**
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్, బి-జోన్, రామకృష్ణాపురం, ఆదిలాబాద్ జిల్లా
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోచెర, బోథ్, ఆదిలాబాద్ జిల్లా - **504 304**
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్, కోరుట్ల, కరీంనగర్ జిల్లా- **505 326**
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కౌత్యా బుజుర్గ్, బోథ్, ఆదిలాబాద్ జిల్లా
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోథ్ బుజుర్గ్, బోథ్, ఆదిలాబాద్ జిల్లా
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్, కాపువాడ, కరీంనగర్ జిల్లా - **505 326**
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్, కోరుట్ల, కరీంనగర్ జిల్లా - **505 326**
" " "	ది రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్కూల్,అరవింద్‌నగర్,అనంతపురం
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా
" " "	ప్రగతి పబ్లిక్ స్కూల్, హయత్‌నగర్, హైదరాబాద్ - **501 505**
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల, బెల్లంపల్లి, ఆదిలాబాద్ జిల్లా
" " "	శ్రీ సరస్వతీ శిశుమందిర్ గోదావరి రోడ్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా
" " "	శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్, హయత్‌నగర్, రంగారెడ్డిజిల్లా
" " "	ప్రగతి విద్యానికేతన్ పాఠశాల, బోథ్ బుజుర్గ్, ఆదిలాబాద్ జిల్లా - **504 304**
" " "	డాల్స్ పబ్లిక్ స్కూల్, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా - **501 505**
" " "	ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల, పాట్నాపూర్, బోథ్, ఆదిలాబాద్ జిల్లా

ఈ పథకం ద్వారా శ్రీరామకృష్ణ ప్రభను మరింతమందికి చేరువ చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు.

ప్రాచీన గాథలు : జీవన వికాసం

– ఆకెళ్ల రాఘవేంద్ర

వామనావతారం – ఆత్మశక్తి సందేశం

మనం కిందటి సంచికలో 'గజేంద్రమోక్షం' కథ అంతరార్థం తెలుసుకొన్నాం. ఒక లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు సాగుతున్నప్పుడు ఎన్నో వ్యామోహాలు అవరోధాలుగా నిలుస్తాయి. వాటన్నింటినీ ఛేదించుకొంటూ అడుగేయడమే విజేత లక్షణం. బాధ, భయం, ఆత్మన్యూనత.... లాంటివన్నీ గజేంద్రమోక్షంలోని మొసలి రూపాలే!

ప్రతివ్యక్తీ తన జీవితంలో ఏదో ఒక సమయంలో భయపడడం సహజం. డబ్బు సంపాదించలేనేమోనన్న భయం కావచ్చు, పరీక్ష తప్పుతానేమోనన్న భయం కావచ్చు, అసలు నేను విజయం సాధించగలనా అన్న భయం కావచ్చు. ఆ భయంవల్ల ఆత్మన్యూనత, దాని వల్ల తీవ్ర మనోవ్యధ, దానివల్ల చివరకు ఆత్మహత్య చేసుకోవాలన్న వెర్రియోచన... ఇలాంటివన్నీ కలగడం సహజం. మనలో ఎంతో శక్తి ఉంది, మనకు మనం వామనుడిలా, మరుగుజ్జులా కనిపించవచ్చు. కానీ మనలోనే ప్రపంచాన్ని జయించగల శక్తి ఉంది. వామనావతారఘట్టం అంతరార్థమిదే.

కంటికి కూడా కనిపించనంత చిన్న సంయుక్తబీజం తల్లి గర్భంలో కణవిభజన చెంది అలా.. అలా.. గర్భస్థశిశువు అవుతుంది. పుట్టిన వెంటనే చూస్తే ఆ శిశువు వేలెడంత ఉంటుంది. కానీ కాలం గడిచేకొద్దీ ఆ శిశువే అయిదారు అడుగుల ఎత్తవుతుంది. కంటికి కూడా కనిపించనంత – వెంట్రుకవాసిలో వెయ్యోవంతు ఉండే పరమాణువులో కోటానుకోట్ల విద్యుచ్ఛక్తి ఉంది. అంటే సూక్ష్మంగా కనిపించే వస్తువులో అనంతమైన శక్తి ఉంటోందన్నమాట. ఆధునిక శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే – నానో టెక్నాలజీ అన్నమాట. అల్పమైనది అనుకొనే వస్తువులో అనల్పమైన శక్తి నిబిడీకృతమై ఉంటోంది.

మనం కూడా అప్పుడప్పుడు భయంతో బెంగపెట్టేసుకుంటాం. బాధతో కుంచించుకుపోతాం. మనమీద మనం నమ్మకాన్ని పోగొట్టేసుకుంటాం. 'నా జీవితం ఇంతే, ఇక నేనేమీ చేయలేను' అని ఆవేదన చెందుతుంటాం. నాకు శక్తి లేదు, నా వల్లకాదు, అని నిస్సహాయులమైపోతాం. ఒళ్లంతా నిస్సత్తువ ఆవరిస్తుంది. మెదడు మొద్దుబారిపోతుంది. కష్టాల్ని తట్టుకోలేక కన్నీటి పర్యంతమైపోతాం. కాని ఆత్మన్యూనత అవసరం లేదనీ, మనకు మనం అల్పంగా కనిపిస్తున్నప్పటికీ అనల్పమైన, అనంతమైన శక్తి మనలో దాగి ఉందనీ చెప్పే ఘట్టం వామనావతార ఘట్టం.

పోతన భాగవతంలో ఎనిమిదవ స్కంధంలో వామనావతార కథ ఉంది. శుక్రాచార్యుల అనుమతితో నూరు యాగాలు చేసిన అసుర రాజు బలిచక్రవర్తి. ఆయన సభాస్థలికి వామనుడు రావడంతో– పొట్టివాడు కదా, – యజ్ఞోపవీతం, గొడుగు, కమండలం, చిన్న పంచెతో ఉన్న ఆ మరుగుజ్జుని చూడడంతో సభికులంతా ఫక్కున నవ్వారు. మనల్ని కూడా చూసి చాలా మంది నవ్వి ఉంటారు, ఈసడించుకుని ఉంటారు, మన శక్తిని అంచనా వేయకుండా చిన్న చూపు చూసి ఉంటారు. వామనుణ్ణి కూడా అలాగే చూశారు, చేశారు, కానీ

"ఇంతింతై, వటుడింతయై, మరియు దానింతై, నభోవీధిపై
నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశిపై
నంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటిపై
నంతై, సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంతసంవర్ధియై"

అన్నట్లుగా మరుగుజ్జు ఆకారంలో పొట్టిగా ఉన్న ఆ వామనుడు–క్రమక్రమంగా పెరిగి ఆకాశం కంటే, మేఘమండలం కంటే, వెలుగుల రాశికంటే, చంద్రుడికంటే, నక్షత్రాలకంటే, మహర్లోకం కంటే, ఆపై సత్యలోకం కంటే – ఎంతో ఎత్తుకి ఎదిగాడు.

మనం కూడా అంతే – ఎంతో ఎత్తుకు ఎదగగలం. అది ఉద్యోగం కావచ్చు, చదువుకావచ్చు, సమస్యను ఎదుర్కోవడం కావచ్చు.. ఇంకా ఏదైనా కావచ్చు. ఇపుడు మనలోకి మనం కుంచించుకు పోతున్నా, రేపటి రోజున ఇంతింతై, వటుడింతై... అన్న రీతిలో విజయాల్ని సాధించగలం. అదెలాగో మరో సందర్భంలో ప్రస్తావిద్దాం! ❖

అసలైన ఆధ్యాత్మికత

- విష్ణుప్రియ

ఆధ్యాత్మిక సాధన అంటే ప్రపంచానికి దూరంగా నిత్య జీవితంతో సంబంధం లేకుండా మానవ సంబంధాలు తెంచేసుకొని, ఏ మారుమూలో జీవితం గడపడం కాదు. ఆధ్యాత్మికత, భౌతికతతో విభేదించదు. భౌతిక జీవనానికి సహాయ సంపత్తులను అందిస్తూ, వ్యక్తి వికాసానికి దారి చూపిస్తూ నిరంతరం మానవ భావనతో కలసి ముందుకుసాగే ఒక అపురూప ధర్మకెరటం 'ఆధ్యాత్మికత'.

"ఒక విజ్ఞాన శాస్త్రవేత్త ఎప్పుడూ ఒక వేదాంతి అయి ఉంటాడు" అన్నారు మహామేధావి ఐన్‌స్టీన్. "ఒక వైజ్ఞానిక పరిశోధనకు ఉద్యమించే శాస్త్రవేత్త తన కార్య నిర్వాహక క్షేత్రాన్ని తయారుచేసుకోవడానికి పూర్తిగా ఆధ్యాత్మిక బలాన్ని ఆధారం చేసుకొని కృతకృత్యుడవుతాడు" అన్నారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.

ఆధ్యాత్మిక సాధనా క్రమంలో జప తప ధ్యానాదులన్నీ చాలా కష్టతరమైనవని ఒక అభిప్రాయం. ఇవి వ్యక్తి ప్రవర్తన సరళంగా సాగి ప్రపంచానికి ఉపయోగపడే విధంగా వ్యక్తిని తీర్చిదిద్దగల శక్తి విడుదల కేంద్రాలు. మన అస్తిత్వాన్ని చైతన్యవంతం చేసుకొని, ప్రపంచ కర్మాగారంలో ఒక క్రమశిక్షణాయుతమైన జీవన శైలితో అద్భుత విజయాన్ని సాధించడానికి మనకు తగిన తర్ఫీదు నిస్తాయి.

భారత దేశంలో ధర్మం తెలియని వారుండరు. ప్రతివారి దృష్టిలోనూ ఒక ఆదర్శ భావ చిత్రం ఉంటుంది. అయితే అది బుద్ధి పరిధిలోనే ఉండిపోతుంది. క్రియారూపంలోకి రావడం లేదు. స్వార్థపరిధిని దాటి మన సంకల్పాలన్నీ అత్యున్నత ప్రమాణాలను అందుకోవడానికి తగిన మానసిక బలం మనకు కావాలి. ఆ బలాన్ని ఆధ్యాత్మిక సాధన ద్వారా మనం సమకూర్చుకోగలం.

వర్తమానాన్ని క్రమబద్ధం చేసుకోగల ప్రశాంతమైన, విశ్వాసపూరితమైన జీవన శైలినీ, జీవన రీతినీ నిర్దేశిస్తుంది ఆధ్యాత్మికత. ఓర్పు, సహనం, శాంతి, సహకారం, స్వచ్ఛత రాజ్యం చేసే స్వర్గ తుల్యమైన సమాజ సంస్థాపనకు కచ్చితంగా అనుసరించవలసిన జీవన సూత్రాలను బోధిస్తుంది ఆధ్యాత్మికత.

సాధారణంగా మనకు అందుబాటులో ఉన్నవాటినీ, మనకు అవసరం అయిన వాటినీ విడిచిపెట్టి మనవి కానివాటినీ, మన దగ్గర లేని వాటినీ, మనకు అక్కరలేని వాటినీ తలుచుకుంటూ తెగ బాధపడిపోతూ ఉంటాం. ఫలితం సమయం వృథా, అశాంతి. మన అవసరాలు తీరక బాధపడుతున్నామా, లేక ఇతరులతో పోల్చుకుని బాధపడుతున్నామా అని ఆలోచించుకోవాలి. ఇది చాలా ముఖ్యం.

"సంతుష్ట స్సతతం యోగి"– తృప్తితో జీవించేవాడే యోగి. తృప్తిగా జీవించడమే ఆధ్యాత్మిక సాధన.

"అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ ఏవ చ". ఇది భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యం. ఎవరినీ ద్వేషించని ప్రేమపూరితమైన హృదయం లేనప్పుడు జీవితానికి అర్థం ఉండదు. సంకుచిత భావాలను వీడి, విశ్వ కుటుంబ మధురిమను అనుభూతం చేసుకోగల మానసిక సౌందర్యాన్ని అనుగ్రహిస్తుంది ఆధ్యాత్మిక సాధన. ప్రేమ, సేవలకు సరైన నిర్వచనాన్ని ఇచ్చేది ఆధ్యాత్మిక సాధన.

వివేకంతో వ్యక్తిగత సామర్థ్యాన్ని పెంచుకొని, సుఖసంతోషాలతో, మమత మానవతలతో, ప్రేమ తత్త్వంతో హృదయాన్ని దైవమందిరంగా చేసుకోగలిగితే అదే అసలైన ఆధ్యాత్మికత. ❖

ఆచార వ్యవహారాలు - అంతరార్థాలు- 37

- రెంటాల జయదేవ

(...గత సంచిక తరువాయి)

పూజకు పనికిరాని పూలు

దేవుళ్ళందరికీ అన్ని రకాల పుష్పాలనూ ఉపయోగించరాదు. ప్రత్యేకించి కొన్నింటిని కొందరు దేవుళ్ళ పూజకు వాడకూడదు. ఆ వివరాలు:

అక్షతలతో-శ్రీమహావిష్ణువును పూజింపరాదు.

గరికతో- దుర్గాదేవిని పూజించకూడదు.

మారేడు దళాలు, తగర పుష్పాలను - సూర్య భగవానుడి అర్చనకు ఉపయోగించరాదు.

ఉమ్మెత్త, అర్క పుష్పాలతో - భైరవుణ్ణి పూజింపరాదు.

తమాల పుష్పాలతో - సరస్వతీదేవిని పూజించకూడదు.

జిల్లేడు, గన్నేరు పూలతో - శ్రీదేవిని పూజింపరాదు.

మొగలి, కుటజ పుష్పాలను - శివుడి పూజకు ఉపయోగించరాదు.

శంకరుడి పూజకు పనికి రానివి

జపాకుంద శిరీషైశ్చ । యూథికా మాలతీ తథా ।
కేతకీ భవ పుష్పైశ్చ । నైవార్చ్యః శంకర స్సదా ॥

(కార్తిక మాహాత్మ్యే)

'దాసాని పుష్పం, వసంత కాలపు మల్లె, దిరిసెన, అడవి మల్లె, సన్నజాజి, మొగిలిపూలతో ఎప్పుడూ శంకరుణ్ణి పూజించకూడదు.'

విష్ణు, నరసింహ పూజలకు పనికి రానివి

మందార మర్క దత్తూరం । శాల్మలీ కాంచనా రజమ్ ।
నిషిద్ధం విష్ణు పూజాయాం । పుష్పం వైభీతకం తథా ॥
నరసింహస్య పూజాయాం । నిషిద్ధం కేతకీ ద్వయమ్ ॥

(పుష్ప మాలాయాం)

'మందారం, జిల్లేడు, ఉమ్మెత్త, బూరుగ, దేవకాంచనం, తాండ్ర పుష్పాలు విష్ణు పూజకు నిషిద్ధం. ఇక, నరసింహస్వామి పూజకు తెలుపు, పచ్చని రంగుల మొగిలి పూవులు కూడా నిషిద్ధం.'

శ్రీకృష్ణుని పూజకు పనికి రానివి

న రక్తచందనం జాతు । గృహ్ణీయా ద్రక్తపుష్పకమ్ ।
బిల్వపత్రై స్త్రత్పుసూనై । ర్నార్చయే ద్దేవకీ సుతమ్ ॥

(గౌతమీయే)

'రక్తచందనం లేదా దానిమ్మ పుష్పాలతో కానీ, మారేడు దళాలతో కానీ శ్రీకృష్ణుణ్ణి అర్చించకూడదు.'

దైవప్రసాద ధారణ

నిజానికి, ఏ పుష్పాన్ని అయినా సరే అత్యంత భక్తి శ్రద్ధలతో, పరిపూర్ణ విశ్వాసంతో దైవానికి సమర్పించాలి. అంతేతప్ప, అనాసక్తిగా, యాథాలాపంగా, తేలిక భావంతో సమర్పించకూడదు. దేవుడికి పూజ చేశాక అలా పూజకు ఉపయోగించిన పుష్పాలను దైవప్రసాదంగా తీసుకొని, భక్తితో ధరించడం మనకు అలవాటు. దీనికి సంబంధించిన వివరణతో ఓ శ్లోకం ఉంది:

కర్ణే పుష్పం గళే గంధః, శిఖాయాం
తులసీదళం న ధారయేత్॥

'పుష్పాన్ని చెవిలో, గంధాన్ని కంఠానికి ధరించాలి. జుట్టుముడిలో(శిఖలో)తులసీ దళాన్ని ధరించరాదు' అని అర్థం.

నిర్మాల్యం తొలగించడమెలా?

ఇక, భగవంతునికి సమర్పించిన పుష్పాలు, పత్రాలను ఆ మరుసటి రోజు ఉదయం తీసివేసి, తాజా పుష్పాలు, పత్రాలతో అర్చించడం మనకు అలవాటు. ముందు రోజు భగవదర్పితమైన పత్ర పుష్పాలను మరునాటి ఉదయానికి 'నిర్మాల్యం' అంటారు.

దేవునికి పుష్పం సమర్పించి, పూజించే సమయంలో ఏ చేతివేళ్ళతో ఎలా పుష్పాన్ని పుచ్చుకోవాలో గతంలో చెప్పారు. మరి, ఇప్పుడిక నిర్మాల్యాన్ని తీసివేసేటప్పుడు అనుసరించాల్సిన పద్ధతిని కూడా చెబుతున్నారు:

మధ్యమా నామికా మధ్యే । పుష్పం సంగృహ్య పూజయేత్ ।
అంగుష్ఠ తర్జన్యగ్రాభ్యాం । నిర్మాల్య మపనోదయేత్ ॥ (స్కాందే)

'చేతిలోని మధ్య వేలు, అనామిక (ఉంగరం వేలు) మధ్యలో పుష్పాన్ని పుచ్చుకొని, పూజించాలి. ఇక, బొటనవేలు, తర్జని (చూపుడువేలు) కొనలతో నిర్మాల్యాన్ని తీసివేయాలి'. ❖

(అష్ట విధ పుష్పాలు, మానసిక పుష్పాలు... వచ్చే సంచికలో...

...17వ పేజీ తరువాయి.



‘నేను’ ఎప్పుడు ముక్తి పొందుతాను? ‘నేను’ నశించినప్పుడు!

‘నేను’, ‘నాది’ అన్నది అజ్ఞానం. ‘నువ్వు’, ‘నీది’ అన్నది జ్ఞానం. నిజమైన భక్తుడు “ఈశ్వరా! నీవే కర్తవు. నేనొక పరికరాన్ని మాత్రమే! నీవు ఏది చేయిస్తే అది చేస్తాను. ఈ ఇల్లు, ఈ కుటుంబమూ నీకు చెందినవి; నాకు చెందినవి కాదు; నీవు ఆదేశించినట్లు పని చేయడం మాత్రమే నా కర్తవ్యం”అని అంటాడు. – శ్రీరామకృష్ణ పరమహంస

అమర భారత ప్రతిభ

యంత్ర శాస్త్రం

Machine Science of India

ఆధునిక ప్రపంచ మనుగడ యావత్తూ యంత్రమయం. నాగరిక జీవన విధానంలో యంత్రం సహాయం లేకుండా ఏ పనీ జరగదు. దైనందిన జీవితంలో యంత్రం పాత్ర అవిభాజ్యమైనది. ఇది పారిశ్రామిక విప్లవం తరువాత మరింతగా బలపడింది. పురోగతి సాధించింది. ఇటువంటి అతిముఖ్యమైన యంత్ర శాస్త్రం గురించిన భారతీయ శాస్త్రవిజ్ఞానం ఏమంటున్నది! ఇందులో మన విజ్ఞానం యొక్క స్థాయి ఏమిటి? ఒకసారి పరిశీలిద్దాం.



మన ఋషులు ఈ యంత్రాల గురించి సవివరంగా ప్రస్తావించి ఉన్నారు.

భరద్వాజ మహాముని యొక్క "యంత్ర సర్వస్వం" అనే గ్రంథం చాలా ప్రసిద్ధి గాంచింది. వాల్మీకి రామాయణంలో - బాలకాండ, సర్గ 5, శ్లో. 10లో నగర వర్ణన చేస్తూ యంత్రాగారాల గురించి వివరిస్తాడు. ఇక రాముడు భరతునితో "రాజప్రాసాదము లన్నీ యంత్రములతో చక్కగా సంరక్షింప బడుతున్నాయి కదా" అని అడుగుతాడు. అంటే ఆ నాటికే రక్షణ వ్యవస్థలో యంత్రసామాగ్రి ఉపయోగించటం తెలిసి ఉండాలి కదా! (అయోధ్యకాండ, సర్గ 100, శ్లో. 53)

దణ్డైశ్చ క్రైశ్చ దన్తైశ్చ సరణి భ్రమణాదిభిః ।
శక్తేరుత్పాదనం కిం వా చాలనం యన్త్రముచ్యతే ॥
- యన్త్రార్ణవము

యంత్రార్ణవము అనే గ్రంథంలో యంత్రవర్ణన చేస్తూ, యంత్రంలో దండ -Lever, చక్ర-Pulley, దంత్-Toothed wheel, సరణి-Inclined plane, భ్రమణ-Screw వంటివి ఉంటాయనీ, శక్తిని జనింపచేయటానికీ, శక్తి దిశను మార్చడానికీ యంత్రాలనూ, అందులోనే వివిధభాగాలనూ ఉపయోగిస్తారనీ యంత్రనిర్వచనం చేశాడు.

భోజరాజు తన 'సమరాంగణ సూత్రధార' అనే గ్రంథంలో ఏ యంత్రానికి ఏయే లక్షణాలు ఉండాలి, యంత్ర భాగాల పరస్పర సంబంధం, ఖచ్చితత్వం, క్షయత (Tuning) శబ్దరహిత చలనం - ఇంధన సామర్థ్యం వంటి 20 లక్షణాల గురించి వివరించి ఉన్నాడు.

హైడ్రాలిక్ శక్తిని ఉత్పత్తి చేయటంలో జలధారను ఉపయోగించే విధానం సమరాంగణ సూత్రధార 31వ అధ్యాయంలో చెప్పబడింది. అలాగే "సూర్యసిద్ధాంతం"లో యంత్రాధ్యాయంలోని 53 నుండి 56 వరకూ గల శ్లోకాలలో జలచక్రం గురించిన వర్ణన ఉంది.

చివరగా భరద్వాజుని "యంత్ర సర్వస్వం"లో 31 రకాల యంత్రాలను, విమానంలో వాటి స్థానం, అవి నిర్వహించే పనినీ పేర్కొన్నారు. వాటిలో విమానం పరిసరాలను విమానంలో నుంచే చూడగలిగే 'విశ్వక్రియా దర్పణం', దిక్కులను సూచించే "దిశాదర్శి", శత్రు విమానాలను పసిగట్టి పక్కకు తప్పుకోగలిగే "వక్ర ప్రసారణ యంత్రం" వంటివి ఉన్నాయి.

జి.ఆర్. జోష్యర్ రచించిన "డైమండ్స్, మెకానిజమ్స్, వెపన్స్ ఆఫ్ వార్, యోగసూత్రాస్" అనే గ్రంథంలో ఎన్నో రకాలయిన ఇంధనాలతో నడపబడే యంత్రాల గురించి వివరింపబడి ఉంది.

- కణాద మహర్షి తన 'వైశేషిక దర్శనం'లో ఐదు రకాల క్రియలు గురించి చెప్పాడు. ఇవన్నీ కూడా ఈనాటి ఆధునిక యంత్ర చలనాలకు సంబంధించినవి.

- ప్రశస్తపాదుడు 'వైశేషిక దర్శనానికి' భాష్యం రచించాడు. అందులో కొన్ని 'గతి సూత్రాలను' సూత్రీకరించాడు.

ఇది న్యూటన్ కంటే దాదాపు వేయి సంవత్సరాల ముందు కాలం నాటిది. అంతటి విలువైన యంత్ర విజ్ఞానం వెల్లివిరిసిన భారతావనిలో, ఆ తరువాత ఆ జ్ఞానం కనుమరుగు కావటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాల మహిమను ధృవపరుస్తుంది. ❖

('భారతీయ ప్రతిభా విశేషాలు' పుస్తకం నుంచి)

వార్తావాహిని

గిరిజన సంచార వైద్యశాల

రాజమండ్రి రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న గిరిజన సంచార వైద్యశాల కోసం ఆధునిక వైద్యపరికరాలతో

రూపొందించిన వాహనానికి రాజమండ్రి రోటరీక్లబ్, యు.కె. రోటరీక్లబ్ ఆర్థిక సహాయం అందించింది. ఈ వాహనాన్ని జనవరి 28న రోటరీక్లబ్ ప్రతినిధులు లాంఛనప్రాయంగా రామకృష్ణ మిషన్‌కు అందజేశారు. ఈ సంచార వైద్యశాల వాహన ప్రారంభాన్ని పురస్కరించుకుని జనవరి 29న వెలగపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో 683 మంది రోగులు చికిత్స పొందారు. 37 మందికి కంటి అద్దాలు, 212 మందికి దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ❖ **నివేదిక : స్వామి అక్షరాత్మానంద**

చిత్రప్రదర్శన

చెన్నై రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో తమిళ మాసపత్రిక 'శ్రీరామకృష్ణ విజయం' జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తమిళనాడులోని పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించింది. సుమారు 20,300 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో 500 మంది విద్యార్థులు గీసిన చిత్రాల్ని ఎంపిక చేసి 'చెన్నై వివేకానంద ఇల్లమ్'లో చిత్రప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ చిత్రప్రదర్శనను చెన్నై రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి గౌతమానందజీ ప్రారంభించారు. జనవరి 12 నుండి 26

వరకు నిర్వహించబడిన ఈ చిత్రప్రదర్శనశాలను 11,000 మంది సందర్శించారు. ❖ **నివేదిక : స్వామి విమూర్తానంద**

విద్యార్థులకు వరం 'వివేకవాహిని'

ఒంగోలు, సూర్యాపేట, హుజూర్‌నగర్, కైకలూరు, పెదకళ్ళేపల్లి, నకిరేకల్-శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యంలో విజయవాడ రామకృష్ణ మిషన్ 'వివేకవాహిని' 2008 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ప్రకాశం, నల్లగొండ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 59 విద్యా సంస్థల్లో వ్యక్తిత్వవికాస సదస్సులను, 13 గ్రామాల్లో సత్సంగాలను నిర్వహించింది. 30,000 మంది విద్యార్థులు

ఈ సదస్సుల్లో పాల్గొని, రూ.1,80,000లు విలువచేసే వివేకానంద సాహిత్య గ్రంథాలను కొన్నారు. ❖

సంయుక్త నివేదిక : మాల్యాద్రి, ఒంగోలు, సుబ్రహ్మణ్య శర్మ, హుజూర్‌నగర్.

ఉచిత వైద్య శిబిరం : **తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం శ్రీరామకృష్ణ సేవాసమితి** స్వామి వివేకానంద జన్మదినోత్సవం సందర్భంగా అంధ, బధిర పాఠశాలల విద్యార్థులకు, గ్రామీణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. శ్రీ యనమదల రామకృష్ణగారు ఇరవైవేల రూపాయలు విలువచేసే మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను కూడా సమితి నిర్వహించింది. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ❖ **నివేదిక : బి. వీరభద్రరాజు**

యువజన సదస్సు

రంగారెడ్డి జిల్లా, వికారాబాద్ వివేకానంద సమితి ఫిబ్రవరి 5న యువజన సదస్సును నిర్వహించింది. సుమారు 1300 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' సర్క్యులేషన్ మేనేజర్ స్వామి రఘునాయకానంద ప్రసంగిస్తూ 'విద్యార్థులు పాశ్చాత్య సంస్కృతి మోజులోపడి జీవిత లక్ష్యాన్ని మరిచిపోతున్నారు. యువత తమ లక్ష్యసాధనలో విజయం సాధించాలంటే స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి' అని అన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే దేనిలోనైనా విజయం సాధించవచ్చు అన్న స్వామి వివేకానంద స్ఫూర్తి వచనాలతో స్వామీజీ తమ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణమంచ్ కార్యదర్శి అప్పల ప్రసాద్ 'విద్యార్థులు పుస్తకాన్ని మస్తకంతో కాకుండా హృదయంతో చదవాలి' అని గుర్తుచేశారు. ❖ **నివేదిక : కె. సంతోష్ కుమార్, కార్యదర్శి.**

జాతీయ యువజన దినోత్సవ ర్యాలీ

విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి 12న ఊరేగింపు నిర్వహించింది. సుందరంగా అలంకరించిన స్వామి వివేకానందుని చిత్రపటాన్ని వాహనంలో రామకృష్ణ బీచ్ నుంచి నగర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో పాల్గొన్న విద్యార్థులకు 'స్వామి వివేకానంద సందేశం' అనే పుస్తకాల్ని ఉచితంగా పంపిణీ చేశారు. ❖ **నివేదిక : స్వామి గరిమానంద**

గ్రంథ పరిచయం

శ్రీమద్భాగవత దశమస్కంధ త్రివిధనామావళి

రచయత: ఇ.వి.శేషావతారము,
వెల : 150/-, పేజీలు : 340,
ప్రాప్తిస్థానము : ఇ.వి. శేషావతారము, గిరీశచంద్ర, ప్లాట్ నెం. 25, ఇ.నెం. 11-13-619, రోడ్డు నెం. 2, హరిపురి, హైదరాబాద్-35, ఫోన్.నెం. 20060147

శ్రీ వల్లభాచార్యుల వారు శ్రీమద్భాగవతములోని ద్వాదశ స్కంధములో చెప్పబడిన దశవిధ లక్షణాలను సర్గము, విసర్గము, స్థానము, పోషణము, ముక్తి, ఆశ్రయము.... భగవంతుని లీలల్ని భక్తజనోద్ధరణ కొరకు పురుషోత్తమనామసహస్రం రచించారు. శ్రీమద్భాగవతమును ప్రతినిత్యమూ పారాయణం చేయడం కష్టం కనుక సులభోపాయంగా ఆచార్యులవారు ఈ నామసహస్రాన్ని వ్రాశారు. అక్కడ చెప్పిన నామాలేకాకుండా ఆచార్యులవారు దశమస్కంధం లోని శ్రీకృష్ణలీలలను "త్రివిధనామావళి" గా ప్రత్యేకంగా రచించారు.సంస్కృత భాషలో ఉన్న ఈ గ్రంథాన్ని శ్రీ శేషావతారంగారు తెలుగులోనికి అనువదించి సులభతరం చేసి, సువిస్తరమైన వ్యాఖ్యానాన్ని అందించడం ముదావహం. భక్తులందరూ తప్పక చదువవలసిన గ్రంథమిది. ❖ **– నాగప్రసాద్**

అమెరికాలో భారతీయ సంస్కృతి

ఆంగ్లమూలం : చమన్‌లాల్
అనువాదం : డా॥ నూతి విక్రమార్క,
వెల : రూ.210/-; పేజీలు : 377,
ప్రాప్తిస్థానము : నూతి ఇందిర, ప్లాట్ నెం : 61/ఎ, శ్రీనివాసపురం కాలనీ, నాగార్జునా హైస్కూలు వెనుక, వనస్థలిపురం, హైదరాబాద్ -70, ఫోన్.నెం. 24242928

చరిత్ర పాఠాలలో నేర్పినదీ, నేర్చుకున్నదీ తప్పు అని సాక్ష్యాధారాలతో సహా నిరూపిస్తూ శ్రీ చమన్‌లాల్ "హిందూ అమెరికా" అనే గ్రంథాన్ని రచించారు. వారు తమ గ్రంథంలో ప్రాచీన భారతదేశానికీ, అమెరికాలోని రెడ్ ఇండియన్లకీ మధ్య పోలికలున్నాయని వివరించారు. ఎంతో విస్తృతంగా అధ్యయనం చేసి, అమెరికాలో తొలివలసలను ఏర్పరచినవారు భారతీయులే అని నిర్ధారించారు రచయిత. ఎన్నో ఆసక్తికరమైన అంశాలున్న ఈ గ్రంథానికి డా॥ నూతి విక్రమార్క ఆంధ్రానువాదం కావించారు. భారతీయుల సంస్కృతీ, ఔన్నత్యాలను తెలుసుకోగోరిన వారికి ఇది అత్యంత ఆసక్తికరమైన గ్రంథం. ❖ **– శ్రీమతి ఎన్. శేషు**

శ్రీ పరమాచార్య చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ వేదాధ్యయనానుసన్ధాన ప్రతిష్ఠానమ్

ప్రవేశ / ఉద్యోగ ప్రకటన

1. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది కోర్సులకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) 'వేదచూడామణి' : ఋగ్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క అధ్యయనము
- యోగ్యతలు : మాతృభాషలో చదువగలిగి, వ్రాయగలిగి ఉండాలి.
- వయస్సు : 8 నుంచి 10 సంవత్సరాల మధ్య
- స్టైఫండ్ : నెలకు రూ. 1,000/-

(ఆ) 'వేదార్థచూడామణి' : ఋగ్వేదము/ యజుర్వేదము/ సామవేదము/ అథర్వవేదము యొక్క భాష్యాధ్యయనము
- యోగ్యతలు : సంస్కృత పరిజ్ఞానముతో బాటు ఏదో ఒక వేదాన్ని పూర్తిగా అధ్యయనం చేసి ఉండాలి.
- వయస్సు : 15 సం॥, ఆ పైన
- స్టైఫండ్ : నెలకు రూ. 3,000/-

2. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ క్రింది ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(అ) వేదాధ్యాపకుడు : (సామవేదము/ అథర్వవేదము - వేదానికి ఒక్కొక్కరు చొప్పున రెండు ఖాళీలు)
- కావలిసిన అర్హతలు : క్రమాంతము లేక పదాంతము
- అదనపు అర్హతలు : ఏదైన మఱియొక వేదము/ వేదభాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
- అనుభవము : 2 సంవత్సరములు
- సంభావన : నెలకు రూ॥ 8,000/- మొత్తము, సౌకర్యములతో

(ఆ) వేదభాష్యాచార్యుడు : (ఒక్కొక్క వేదానికి ఒక్కొక్కరు చొప్పున 4 ఖాళీలు)
- విద్యార్హత : ఏదైనా వేద భాష్యంలో ఉత్తీర్ణత
- అదనపు అర్హత : మరొక వేద భాష్యము/ శాస్త్రము యొక్క పరిజ్ఞానము
- అనుభవార్హత : 5 సం॥
- సంభావన : నెలకు రూ. 10,000/- మొత్తము, సౌకర్యములతో

ముద్రించిన దరఖాస్తు ఫారములను **శ్రీ పి. వేంకటేశ్వర్లు గారు, మేనేజింగ్ డైరెక్టర్, కాకతీయ సిమెంట్, సుగర్ & ఇండస్ట్రీస్ లిమిటెడ్, 'గురుకృప' (ఆంధ్రా బ్యాంకు ఎదురుగా), 1 - 10 - 140/1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 500 020** (ఫోను: 040 - 27637717) నుంచి ప్రత్యక్షముగా గాని, పోస్టు ద్వారా గాని పొందవచ్చు. పూర్తి చేయబడిన ఆ ముద్రిత దరఖాస్తులను ఈ పై అడ్రసుకు పంపవలెను. అవసరాన్ని బట్టి ఖాళీలను పూరించుట లోనూ, అర్హతల సవరణ లోనూ మేనేజ్‌మెంటుకు అధికారము కలదు.

సం/-

హైదరాబాద్ — కులప్రశాసకుడు

Sponsored by:

KAKATIYA CEMENT SUGAR & INDUSTRIES LIMITED

Regd. Office : 1 - 10 - 140/1, Gurukrupa, Ashok Nagar, Hyderabad - 500 020
Ph: 2763 7717, 2763 3627, Fax No. 040-27630172, Email: info @ kakatiyacement.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**